## నీలగిరి నిత్యపద్యం
కందం

కర్ణము వినుటకు తోడ్పడు
వర్ణము బలుమగ నొసంగు వలచిన జిత్రమ్
జీర్ణమునగు తినినట్టిది
చూర్ణమునౌనట దినుసులు జోరుగ విసరన్

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 183 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 12-10-2025 పేజీలు -8 | వెలః రూ. 5.00



### విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.




## మూడో తరగతి నుంచే ఏఐ!..

- వచ్చే ఏడాది నుంచి అమలు.
- కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక

**న్యూఢిల్లీ- అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విద్యారంగంలో కీలక మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతున్నది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి 3వ తరగతి నుంచే విద్యార్థులందరికీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ని పాఠశాలలో తప్పనిసరిగా చేర్చాలని విద్యా మంత్రిత్వశాఖ ప్రణాళికలు రూపొందిస్తున్నది. దీనికి సంబంధించి ఒక సమగ్ర ఫ్రేమ్‌వర్క్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఫ్రేమ్‌వర్క్‌ను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) సిద్ధం చేస్తున్నది. ప్రస్తుతం 18 వేలకుగాపైగా సీబీఎస్ఈ పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి ఏఐని ఒక నైపుణ్య కోర్సుగా అందిస్తున్నారు. ఏఐ, ఉద్యోగాలపై నీతి ఆయోగ్ విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం ఏఐ కారణంగా సుమారు 20 లక్షల సంప్రదాయ ఉద్యోగాలు

-మిగతా 2 లో

# హైకోర్టు స్టే తో సుప్రీంలో సవాల్

### 42శాతం బీసీ రిజర్వేషన్ల పై సుప్రీంకోర్టు కి వెళ్లాలని నిర్ణయం

- జీవో 9 ని అమలు చేసేందుకు సుప్రీం కోర్ట్ తలుపు తట్టాలి
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం
- పార్టీ నేతలు, మంత్రులతో చర్చించిన సిఎం రేవంత్



**హైదరాబాద్, అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీసీ రిజర్వేషన్ల పై సుప్రీంకోర్టు కి వెళ్లాలని నిర్ణయం తీసుకుంది. సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించనుంది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన జీవో 9 పై తెలంగాణ హైకోర్టు స్టే విధించడంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైకోర్టు తీర్పు ను స్టడీ చేసిన ప్రభుత్వం.. సీనియర్ కౌన్సిల్ తో సుప్రీంకోర్టు లో వాదనలు వినిపించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. అభిషేక్ మను సింగ్వి తో పాటు సిద్దార్థ దవే.. రిజర్వేషన్ల పై ప్రావీణ్యం కలిగిన అడ్వకేట్ లతో వాదనలు వినిపించాలని నిర్ణయించినట్లు సమాచారం. హైకోర్టు స్టే నేపథ్యంలో స్థానిక సంస్థలలో బీసీలకు 42




-మిగతా 2 లో




## 42శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

- బీజేపీ, బీఆర్ఎస్ కలిసి బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే కుట్ర
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ విమర్శలు

**హైదరాబాద్, -అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని మరోసారి టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ల జీవోను, ఎన్నికల నోటిఫికేషన్ అమలుపై హైకోర్టు స్టే ఇచ్చినందున సుప్రీంకోర్టుకు వెళ్లి అప్పీలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అక్కడ వెసులు బాటు దొరుకుతదని ఆశిస్తున్నట్లు తెలిపారు. రిజర్వేషన్లు ఆపటంలో అసలైన ముద్దాయి బీజేపీ అని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. గవర్నర్ దగ్గర బిల్లుని పెండింగ్ లో

-మిగతా 2 లో

## చైనాపై 100 శాతం సుంకాలు.

- చైనా దిగుమతులపై ట్రంప్ టాక్స్
- నవంబర్ 1 నుంచి అమల్లోకి
- అరుదైన ఖనిజాల ఎగుమతి చైనా ఆంక్షలు విధించడంపై ఆగ్రహం వ్యక్తంచేసిన ట్రంప్..

**వాషింగ్టన్ -** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నంత పనీ చేశారు. అరుదైన ఖనిజాల ఎగుమతి చైనా ఆంక్షలు విధించడంపై ఆగ్రహం వ్యక్తంచేసిన ట్రంప్.. అమెరికాలోకి ప్రవేశించే ఆ దేశ వస్తువులపై భారీ సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. తాజాగా చైనా దిగుమతులపై అదనంగా 100 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇవి నవంబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయన్నారు. ఇప్పటికే చైనా వస్తువులపై 30శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. తాజా టారీఫ్‌లతో అవి 130 శాతానికి పెరిగాయి. అదేవిధంగా క్రిటికల్ సాఫ్ట్‌వేర్‌ను ఇతర దేశాలతో పంచుకోవడంపై నియంత్రణ విధిస్తున్నట్లు వివరించారు.వాణిజ్యంపై చైనా అసాధారణ రీతిలో దూకుడుగా వ్యవహరిస్తుందన్న ట్రంప్.. ఆ దేశ ఉత్పత్తులతో పాటు అక్కడి

-మిగతా 2 లో





## నోబెల్ శాంతి బహుమతి ఇమ్మని అడగలేదు

- మచాడతో ఫోన్‌లో మాట్లాడనని ట్రంప్ వెల్లడి
- ఆమె పోరాటానికి తన మద్దతు ఉంటుందని ప్రకటన

**వాషింగ్టన్,** ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి బహుమతి దక్కకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా స్పందించారు. ఈ బహుమతి కోసం ట్రంప్ తహతహలాడిన విషయం తెలిసిందే. అయితే, ట్రంప్ 'శాంతి' ఆశలపై నీళ్లు చల్లుతూ 2025 నోబెల్ శాంతి బహుమతి వెనెజువెలా ప్రధాన ప్రతిపక్ష నాయకురాలు, ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న మరియా కొరీనా మచాడోకు నోబెల్ కమిటీ శుక్రవారం ప్రకటించింది. ఈ నేపథ్యంలో శాంతి బహుమతి దక్కకపోవడంపై ట్రంప్ తాజాగా స్పందించారు. ఈ మేరకు మరియా కొరీనా మచాడోతో ఫోన్‌లో సంభాషించినట్లు తెలిపారు. 'కొరీనా మచాడోతో ఫోన్‌లో మాట్లాడాను. నా గౌరవార్థం దాన్ని స్వీకరించినట్లు ఆమె నాతో చెప్పారు. అలా అని ఆ బహుమతి నాకు ఇచ్చేయమని నేను అడగలేదు. విపత్తు సమయంలో వెనెజువెలాలోని ప్రజలకు ఆమె చాలా సాయం చేశారు. నేను ఆమెకు తోడున్నా. ఇకముందు కూడా ఉంటా' అని వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి మరియా కొరీనా మచాడోను వరించిన విషయం తెలిసిందే. ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కోసం విశేషంగా కృషి చేసిన మచాడో వెనెజువెలా ఉక్కు మహిళగా కూడా పేరుపొందారు. టైమ్ మ్యాగజైన్ ప్రచురించిన ప్రపంచంలోని

-మిగతా 2 లో

# రైతుల ఆదాయం పెంచుతాం

### ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను పండించాలి

- ఇతర దేశాలపై ఆధారపడకుండా స్వయంసమృద్ధి సాధించాలి
- జీఎస్టీ సంస్కరణతో రైతులు, గ్రామీణ రంగానికి ప్రయోజనం
- సాగు వ్యవయం తగ్గించేందుకు ఐదేళ్లలో రూ.13లక్షల కోట్ల సబ్సిడీ
- ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని ప్రారంభించిన మోడీ




**న్యూఢిల్లీ, అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దేశం వికసిత్ భారత్ వైపు అడుగులు వేయడంలో రైతులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. భారత్ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే.. కేవలం వరి, గోధుమ పంటల పైనే కాకుండా ప్రొటీన్ అధికంగా లభించే పప్పులకు సంబంధించిన సాగును మరింత పెంచాలని రైతులకు సూచించారు. ప్రపంచ మార్కెట్‌లకు ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను

-మిగతా 2 లో

## సిఎం రేవంత్ రెడ్డి నల్లమల పిల్లి

- కృష్ణా, గోదావరి నీళ్ల దోస్తున్నా ఉలుకేదీ
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు వెటకారం



**హైదరాబాద్ అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నల్లమల పులి కాదు.. నల్లమల పిల్లి అని మాజీ మంత్రి హరీశ్‌రావు సెటైర్లు వేశారు. కింది నుంచి గోదావరి నీళ్లు ఏపీ తీసుకుపోతే.. పైన కృష్ణా నీళ్లు కర్ణాటక తీసుకుపోతే, మన బ్రతుకు ఏం కావాలని హరీశ్‌రావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి మొన్న మల్లికార్జున ఖర్గేను పరామర్శించడానికి కర్ణాటకకు వెళ్లినప్పుడు,

-మిగతా 2 లో

## పదేళ్లలో కాళేశ్వరం కడితే.. మూడేళ్లకే కూలింది

### కృష్ణాగోదావరి జలాల్లో రాజీపడేది లేదు

- ఆల్మట్టి ఎత్తును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించం
- హరీష్ రావు అబద్దాల ప్రచారంమానుకోవాలి
- మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్





**హనుమకొండ, అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ నీటి హక్కులను కాపాడేందుకు తాము పోరాడుతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్ట్‌పై కేంద్రానికి ఇప్పటికే లిఖిత పూర్వక ఫిర్యాదు చేశామని చెప్పారు. అలాగే ఆలమట్టి ఎత్తు పెంపునకు వ్యతిరేకంగా కూడా తాము ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. బనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో కట్టకుండా చూస్తామని మంత్రి ఉత్తమ్ ప్రకటించారు. అయితే నీటి పంపకాల పంచాయతీలో మంత్రి హోదాలో హాజరైన ఏకైక వ్యక్తిని తానేనని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తు చేశారు. మీరు నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ పనికి రాకుండా పోయిందంటూ హరీశ్ రావుకు చురకలంటించారు. ఈ 22

-మిగతా 2 లో

## కాంగ్రెస్‌లో మరో ఇద్దరు మంత్రుల పంచాయితీ

- మేడారం కాంట్రాక్టుల విషయంలో రచ్చ
- వరంగల్‌లో వేలు పెడుతున్న పొంగులేటి
- మండిపడ్డ కొండా సురేఖ దంపతులు



**వరంగల్,** మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్ మధ్య వివాదం మరువక ముందే.. కాంగ్రెస్ క్యాబినెట్ మంత్రుల మధ్య మరో లొల్లి మొదలైంది. మేడారం అభివృద్ధి టెండర్ల విషయంలో వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ఆ శాఖకు చెందిన మంత్రుల మధ్య విభేదాలు ముదిరి రచ్చకెక్కాయి. మంత్రి పొంగులేటిపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సీఎం రేవంత్ రెడ్డికి, పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. వరంగల్ రాజకీయాలతోపాటు దేవాదాయ శాఖలో మంత్రి పొంగులేటి జోక్యం చేసుకుంటున్నట్లు కొండా దంపతులు అందులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకి ఫోన్ చేసిన కొండా మురళి ఆయనకు ఫిర్యాదు చేశారు. పొంగులేటి తన సొంత కంపెనీకి పనులు ఇప్పించుకుంటున్నారని తెలిపారు. ఆయన వల్ల

-మిగతా 2 లో

# మూడో తరగతి నుంచే ఏఐ!..

(మొదటి తరువాయి)

కనుమరుగైనా, సరైన వాతావరణాన్ని సృష్టిస్తే 80 లక్షల కొత్త ఉద్యోగాలు పుట్టుకొచ్చే అవకాశం ఉంది. ఏఐ రంగంలో భారత భవిష్యత్తు కోసం ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు కలిసి పనిచేయాలని, తగినంత మౌలిక సదుపాయాలు కల్పించాలని నివేదిక సిఫార్సు చేసింది. ఈ దిశగా పటిష్టమైన చర్యలు తీసుకుంటే, ఏఐ రంగంలో భారత్ కేవలం తన ఉద్యోగులను కాపాడుకోవడమే కాకుండా, ప్రపంచ ఏఐ పటంలో నాయకత్వం వహించగలదని నివేదిక స్పష్టం చేసింది.

## హైకోర్టు స్టేతో సుప్రీంలో సవాల్

(మొదటి తరువాయి)

శాతం రిజర్వేషన్లు అమలు కోసం సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయిచింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి , టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, సుప్రీంకోర్టు న్యాయవాది అభిషేక్ మను సింగ్వి తదితరులు జూమ్ మీటింగ్ లో మాట్లాడారు. హైకోర్టు స్థానిక సంస్థలు ఎన్నికల నోటిఫికేషన్, జీవో 9 మీద స్టే ఇవ్వడంపై తదుపరి చర్యల గురించి సుదీర్ఘంగా చర్చించారు. జీవో 9 ని అమలు చేసేందుకు సుప్రీం కోర్ట్ తలుపు తట్టాలని నిర్ణయానికి వచ్చారు. ఈ సందర్భంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని సీఎం రేవంత్ అన్నారు. మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న లక్ష్యం గా మందుకెళ్తోంది. బీసీలకు రిజర్వేషన్లు విషయం తేల్చే వరకు స్థానిక ఎన్నికలకు వెళ్లబోమని ఇప్పటికే మంత్రులు చెప్పారు. మరో వైపు సుప్రీం తీర్పు ప్రకారం పాతపద్ధతిలో అంటే.. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకుండా స్థానిక ఎన్నికలు నిర్వహించుకోవచ్చని హైకోర్టు తెలిపింది. జీవో 9 పై మాత్రమే స్టే ఇచ్చిందని..రిజర్వేషన్ల విషయంలో క్లారిటీ ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రభుత్వానికి లేఖ రాసింది. మరోవైపు వచ్చే వారంలో క్యాబినెట్ భేటీ జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. కాగా హైకోర్టు జీవో 9పై స్టే విధిస్తూ, 2 వారాల్లో పిటిషనర్లు కౌంటర్ దాఖలు చేయాలని, అలాగే 4 వారాల్లో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. తాజాగా బీసీ రిజర్వేషన్ల పై హైకోర్టు ఆర్డర్ కాపీ వెలువడింది. జీఓ 9, 41, 42 ల పై హైకోర్టు స్టే విధించింది. ట్రిపుల్ టెస్టు పాటించకపోవడం పై హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. సుప్రీం కోర్టు నిబంధనల ప్రకారం 50 శాతం రిజర్వేషన్లు మించి ఉండడాన్ని తప్పుబట్టింది. తదుపరి విచారణ డిసెంబర్ 3 కు వాయిదా వేసింది. వికాస్ కృష్ణా రావు గవాలి, రాహుల్ రమేష్ వాగ్ కేసుల్లో సుప్రీంకోర్టు తీర్పులను హైకోర్టు పరిగణలోకి తీసుకున్నది.

## 42శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

(మొదటి తరువాయి)

ఉంచారని.. గవర్నర్‌ను నియమించేది ఎవరని ప్రశ్నించారు. మూడు చట్టాలు ఒక ఆర్డినెన్సు గవర్నర్ వద్ద పెండింగ్ లో ఉన్నాయని చెప్పారు. బీసీలకు నోటి దాకా వచ్చిన ఫలాలను అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ కు చిత్తశుద్ధి ఉందన్న ఆయన.. మోదీ బీసీ ప్రధాని అని చెప్పుకునే బీజేపీ నేతలు, బీసీ రిజర్వేషన్ బిల్లుపై ఎందుకు ఒత్తిడి తీసుకురావటం లేదు? అని ప్రశ్నించారు. ఏపీ ప్రాజెక్టు బనకచర్ల విషయంలో చేయాల్సింది అంత చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ ఉదాసీనత వల్ల జీవో ఇచ్చారని దుయ్యబట్టారు.

## చైనాపై 100 శాతం సుంకాలు.

(మొదటి తరువాయి)

నుంచి దిగుమతయ్యే అన్ని వస్తువులపైనా పెరిగిన సుంకాలు అమలవుతాయన్నారు. ఇది మినహాయింపు లేకుండా అన్ని దేశాలను ప్రభావితం చేయిస్తుందని తన ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. చైనా తీసుకునే తదుపరి చర్యల ఆధారంగా సుంకాలపై అమెరికా నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు. అమెరికా తయారుచేసే దాదాపు ప్రతి ఉత్పత్తి పైనా భారీగా ఎగుమతి ఆంక్షలు విధించాలని చైనా యోచిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.అమెరికాకు అరుదైన ఖనిజాలు ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ట్రంప్.. దక్షిణ కొరియా పర్యటనలో జిన్‌పింగ్‌తో సమావేశమవడానికి కారణాలు కనిపించడం లేదని అభిప్రాయపడ్డారు. అమెరికా దిగుమతి చేసుకునే చైనా ఉత్పత్తులపై భారీగా సుంకాలు పెంచాలని యోచిస్తున్నామని ట్రూత్ సోషల్ వేదికగా డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. వీటితో పాటు మరిన్ని చర్యలను పరిశీలిస్తున్నామని వెల్లడించిన కొన్ని గంటల్లోనే భారీగా సుంకాలను పెంచడం గమనార్హం.

## నోబెల్ శాంతి బహుమతి ఇమ్మని అడగలేదు

(మొదటి తరువాయి)

అత్యంత పలుకుబడిగల 100 మంది ప్రముఖుల జాబితాలో కూడా ఆమె చోటు దక్కించుకున్నారు. గత ఏడాది జరిగిన వెనెజువెలా పార్లమెంట్ ఎన్నికలలో భారీ స్థాయిలో రిగ్గింగ్ జరిగి ప్రస్తుత అధ్యక్షుడు నికొలస్ మదురో గెలుపొందిన తర్వాత 58 ఏళ్ల మచాడో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ శాంతి బహుమతి దక్కడంపై మరియా కొరీనా స్పందిస్తూ.. 'స్వేచ్ఛ కోసం, ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్న వెనెజువెలా ప్రజలందరికీ ఈ గుర్తింపు గొప్ప ప్రేరణ ఇస్తుంది. లక్ష్యసాధనలో విజయానికి చేరువలో ఉన్నాం. ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాలు మాకు మిత్రులు. ఈ పురస్కారాన్ని కష్టాల్లో ఉన్న వెనెజువెలా ప్రజలతోపాటు మా పోరాటానికి నిర్మాణాత్మక మద్దతు ఇస్తున్న ట్రంప్‌నకు అంకితం ఇస్తున్నా' అని అన్నారు.

# రైతుల ఆదాయం పెంచుతాం

(మొదటి తరువాయి)

పండించాలన్నారు. దేశంలో పంటల ఉత్పత్తికి అయ్యే ఖర్చులు తగ్గించి.. రైతుల ఆదాయం పెంచే దిశగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో పదేళ్లలో వ్యవసాయ రంగంలో కేవలం రూ.5 లక్షల కోట్ల సబ్సిడీలు ఇస్తే.. తమ ప్రభుత్వం పదేళ్లలో రైతులకు రూ.13 లక్షల కోట్లకు పైగా సబ్సిడీలు ఇచ్చిందని పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో శనివారం నాడు జరిగిన ప్రత్యేక కృషి ప్రోగ్రాంలో ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా గత నెలలో అమల్లోకి వచ్చిన జీఎస్టీ సంస్కరణతో రైతులు, దేశం లోని గ్రామీణ రంగానికి మరింత ప్రయోజనం చేకూరిందని మోదీ చెప్పారు. గత ప్రభుత్వాలకు వ్యవసాయం పై ఎలాంటి విజన్ లేదని విమర్శించారు. రైతుల ఆదాయం పెంచేందుకు, పంటల సాగు వ్యయం తగ్గించేందుకు గత పదేళ్లుగా ఎన్డీయే ప్రభుత్వం ఎరువులపై రూ.13లక్షల కోట్ల సబ్సిడీ ఇచ్చిందని ప్రధాని మోదీ అన్నారు. యూపీఏ పదేళ్లలో రూ.5 లక్షల కోట్లు మాత్రమే సబ్సిడీగా ఇచ్చిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు వ్యవసాయరంగానికి ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని వివరించారు. రైతులకు



కేంద్రంలోని గత కాంగ్రెస్ ప్రభుత్వం చేసేందేమీ లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 2004 నుంచి 2014 వరకూ యూపీఏ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయరంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. అయితే బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 11 ఏళ్లుగా రైతుల అభివృద్ధి, స్వయం సమృద్ధికి ఎన్నో చర్యలు తీసుకుందని వివరించారు. వ్యవసాయరంగానికి సంబంధించిన వివిధ శాఖలు ఇష్టారీతిలో వ్యవహరించడం వల్ల దేశంలోని వ్యవస్థాయ వ్యవస్థ బలహీనమవుతూ వచ్చిందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిలో మార్పులు చేస్తూ విత్తనాల దగ్గర నుంచి మార్కెట్ వరకూ రైతులకు ప్రయోజనాలు చేకూరే లెక్కలేనని సంస్కరణలు తెచ్చామని చెప్పారు. దేశ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు దాదాపు రెట్టింపయ్యాయని, ఆహారధాన్యాలు, పళ్లు, కాయగూరల ఉత్పత్తి సుమారు 90 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెరిగిందని, గతంలో ఇది 64 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉండేదని చెప్పారు. 2014 నుంచి తేనె ఉత్పత్తి రెట్టింపు అయిందని అన్నారు. అభివృద్ధి భారతాన్ని కోరుకుంటే ప్రతి రంగంలోనూ ఇండియా బలపడాల్సి ఉంటుందన్నారు. ఏవో కొన్ని సాధించినంత మాత్రాన తృప్తి పడిపోరాదని సూచించారు. వెనుకబడిన ప్రాంతాలపై దృష్టి పెట్టినప్పుడే గణనీయమైన ఫలితాలు ఉంటాయన్నారు. ఇవాళ యాస్పిరేషనల్ జిల్లాల్లో ప్రసూతి మరణాలు తగ్గాయని, చైల్డ్ హెల్త్ మెరుగైందని, విద్యాప్రమాణాలు పెరిగాయని చెప్పారు.

# పదేళ్లలో కాళేశ్వరం కడితే.. మూడేళ్లకే కూలింది

(మొదటి తరువాయి)

నెలల్లో కాళేశ్వరం ప్రాజక్ట్ నయాపైసా కూడా పనికి రాలేదన్నారు. మంత్రి సీతక్కతో కలిసి హనుమకొండలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిరుపయోగంగా ఉండి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నుంచి చుక్కనీరు లిఫ్ట్ చేయకుండా మేం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మూడో పంటలో కూడా భారతదేశంలో అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సృష్టించింది. ఈ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 108.5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పడుతోంది. దాంట్లో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేయబోతోంది. భారత దేశంలో ఇంత ధాన్యం ఇప్పటి వరకు ఏ రాష్ట్రం కొనుగోలు చేయలేదని మంత్రి వివరించారు. హరీశ్ రావు మంత్రిగా ఉన్న సమయంలో గోదావరి జలాలను ఆంధ్రకు అప్ప జెప్పారని గుర్తు చేశారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ వాటా నీటిని తాము కాపాడుకుంటామని తెలిపారు. తప్పుడు మాటల ద్వారా అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారంటూ హరీశ్ రావుపై మండిపడ్డారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బీఆర్ఎస్ కట్టిన ఏకైక కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ కూలిపోయిందని వ్యంగ్యంగా అన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ తుమ్మడిహెట్టి వద్ద తట్టెడు మట్టి ఎత్త లేదని విమర్శించారు. గోదావరి జలాల విషయంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే తెలంగాణకు మేలు



జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. హరీశ్ రావు మాట్లాడిన మాటలలో వాస్తవాలు ఏమి లేవని.. ఈ తరహా ప్రచారాన్ని మానుకోవా లంటూ ఆయనకు ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దేశంలోనే అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డుల కెక్కిందని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. త్వరలో ధాన్యం కొనుగోళ్లు కూడా ప్రారంభమవుతాయన్నారు.గోదావరి, కృష్ణా జలాల విషయంలో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందంటే అది భారత రాష్ట్ర సమితి పాలనలోనే. కృష్ణా జలాల్లో 511 టీఎంసీలు ఏపీ ప్రభుత్వం తీసుకోవచ్చని, తెలంగాణకు కేవలం 299 టీఎంసీలు చాలని సంతకాలు చేసింది కేసీఆర్ ప్రభుత్వమే. మన నీటి హక్కులు కాపాడే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ముందుకెళ్తున్నాం. నీటి వాటాల విషయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలే. గోదావరి- బనకచర్ల ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వ్యతిరేకిస్తోంది. ఇదే విషయాన్ని గతంలో అనేక సార్లు చెప్పాం. కర్ణాటకలో అల్మట్టి డ్యాం ఎత్తు పెంపును కూడా వ్యతిరేకిస్తున్నాం. కృష్ణా జలాల్లో 70 శాతం తెలంగాణకే కేటాయించాలని మేం వాదనలు వినిపిస్తున్నాం. పదేళ్లలో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు మాత్రమే నిర్మించింది. అది కూడా మూడేళ్లకే కూలిందని మంత్రి ఉత్తమ్ అన్నారు.

అవాస్తవాలు మాట్లాడుతూ.. తమ ప్రభుత్వాన్ని బద్నాం చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి. హరీశ్ రావుకు తెలంగాణ భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. అబద్దాలను ప్రచారం చేస్తూ ఆరోపణలు చేయడం సరికాదంటూ హరీశ్ రావుకు ఆయన హితవు పలికారు. బనకచర్లపై హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. అంతేకాదు.. బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణానికి పార్టీ వ్యతిరేకమని తాము మొదటి నుంచి చెబుతున్నామని గుర్తు చేశారు.

## సిఎం రేవంత్ రెడ్డి నల్లమల పిల్లి

(మొదటి తరువాయి)



ఆలమట్టి డ్యాం ఎత్తు పెంపు గురించి సిద్ధరామయ్య, శివకుమార్ దగ్గర మాట్లాడుతాడను కున్నా. వాళ్ళ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అయినా రేవంత్ రెడ్డి మాట్లాడలేదు. ఆలమట్టి డ్యాం ఎత్తు పెంచితే తెలంగాణ ఎడారిగా మారుద్దని కనీసం బుద్ధి రేవంత్ రెడ్డికి లేదు. రాహుల్ గాంధీతో కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక ఫోన్ కూడా చేపించలేకపోతున్నాడు రేవంత్ రెడ్డి. రేవంత్ రెడ్డి ఢిల్లీకి బ్యాగులు మోయడం ఒక్కటే పని కాదు.. తెలంగాణ బాగోగుల గురించి కూడా పట్టించుకో అని హరీష్ రావు సూచించారు. ఏపీ 463 టీఎంసీల నీళ్లు మళ్లిస్తే నేను మీద 112 టీఎంసీలు ఆపుకుంటా అని కర్ణాటక అంటుంది.. నేను 74 టీఎంసీలు ఆపుకుంటా అని మహారాష్ట్ర అంటుంది. 112 టీఎంసీలు కర్ణాటక, 74 టీఎంసీలు మహారాష్ట్ర ఆపితే మన పరిస్థితి ఏంది. మాట్లాడితే నల్లమల బిడ్డ అంటాడు.. ఆ నల్లమలను అనుకొని పారే కృష్ణా నదిలో ఆ మహబూబ్ నగర్ జిల్లాకు నష్టం జరిగితే ఎందుకు మాట్లాడటం లేదు. నువ్వు నల్లమల పులివా, పిల్లివా, ఎలుకవా.. ఎందుకు మాట్లాడటం లేదు. పులి అయితే మాట్లాడేవాడివి.. పిల్లివి, ఎలుకవు కాబట్టి మాట్లాడటం లేదు అని హరీశ్‌రావు ఘాటుగా విమర్శించారు.

## కాంగ్రెస్‌లో మరో ఇద్దరు మంత్రుల పంచాయితీ

(మొదటి తరువాయి)

జిల్లాలో తాము ఇబ్బంది పడుతున్నామని వెల్లడించారు. అదేవిధంగా జిల్లా రాజకీయాలను ఖర్గేకి వివరించారు. పార్టీ పెద్దలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లారు. హైకమాండ్ నుంచి సానుకూల స్పందన వచ్చిందని కొండా దంపతులు పేర్కొన్నారు. కాగా, ఇటీవల మేడారంలో పర్యటించిన సీఎం రేవంత్ రేవంత్ రెడ్డి.. పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వరంగల్ జిల్లా రాజకీయాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జోక్యం చేసుకుంటున్నారంటూ కాంగ్రెస్ నేత కొండా మురళి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ జిల్లాలో పొంగులేటి పెత్తనం ఏంటని ఆయన ప్రశ్నించారు. దీనిపై ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖలో పొంగులేటి జోక్యంపై పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేకు ఫిర్యాదు చేశారు. మేడారం టెండర్ల వ్యవహారంపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పొంగులేటి సొంత కంపెనీకి పనులు ఇప్పించుకున్నారని అందులో ఆరోపించారు. ఈ వ్యవహారంలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీలతోపాటు మీనాక్షి నటరాజన్‌కు సైతం కొండా మురళి ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో హైకమాండ్ నుంచి సానుకూల స్పందన వచ్చినట్లు ఆయన తెలిపారు.

2025 అక్టోబర్ 12, ఆదివారం తెలుగు పంచాంగం




మాసం - పక్షం
ఆశ్వయుజ మాసం
కృష్ణ పక్షం
తిథి
పంచమి: అక్టోబర్ 11 ఉదయం 12:24 అక్టోబర్ 12 ఉదయం 11:36 వరకు
షష్టి: అక్టోబర్ 12 ఉదయం 11:36 అక్టోబర్ 13 ఉదయం 11:09 వరకు
నక్షత్రం
రోహిణి: అక్టోబర్ 11 ఉదయం 5:11 అక్టోబర్ 12 ఉదయం 6:13 వరకు
మృగశిర: అక్టోబర్ 12 ఉదయం 6:13 అక్టోబర్ 13 ఉదయం 7:36 వరకు
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:37 - 5:23
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:41 - 12:26
అమృతకాలం: ఉదయం 9:18 - 10:52
అశుభ సమయాలు
రాహుకాలం: సాయంత్రం 4:28 - 5:55
యమగండం: మధ్యాహ్నం 12:03 - 1:31
గులికా: ఉదయం 3:00 - 4:28
దుర్ముహూర్తం: ఉదయం 4:25 5:13, మధ్యాహ్నం 4:07 - 4:55
వర్జ్యం: ఉదయం 6:30 - 8:08

# నేరుగా విత్తే వరి సాగుపై అవగాహన సదస్సు




**మంచాల, అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్రంలో వరి సాగు ఖర్చులను తగ్గించి, తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించేందుకు నేరుగా విత్తే వరి విధానాన్ని ప్రోత్సహించేందుకు భారత వరి పరిశోధన సంస్థలో ఎస్బీఐ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో "సుస్థిర వరి ఉత్పత్తికి నేరుగా విత్తే వరి విధానం" పేరుతో ప్రత్యేక ప్రాజెక్టు అమలవుతోంది. ఈ ప్రాజెక్టు ద్వారా రైతులకు శిక్షణ కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిరంతరంగా నిర్వహించబడుతున్నాయి. ఈ క్రమంలో, శనివారం రంగారెడ్డి జిల్లా మంచాల మండల రైతుల కోసం నేరుగా విత్తే వరి సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ప్రధాన పరిశోధకుడు డాక్టర్ రాపోలు మహేందర్ కుమార్ మాట్లాడుతూ, సాంప్రదాయ నాటువేసే వరి సాగులో అధిక ఖర్చులు, నీటి వినియోగం, మీథేన్ వాయువుల ఉద్గారం వల్ల పర్యావరణానికి నష్టం కలుగుతోందని తెలిపారు. ఈ సమస్యలకు పరిష్కారంగా నేరుగా విత్తే వరి విధానం ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా నీటి వినియోగం తగ్గడం, కూలీల అవసరం తగ్గడం, ఒక ఎకరా వరి సాగుకు సుమారు రూ.5000/- వరకు ఖర్చు తగ్గడం మాత్రమే కాక, పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుందని వివరించారు. సాంప్రదాయ నాటుతో పోలిస్తే DSR విధానం రైతులకు లాభదాయకమని స్పష్టం చేశారు. శిక్షణ అనంతరం రైతులను పరిశోధన సంస్థలో ఏర్పాటు చేసిన క్షేత్రాలకు తీసుకెళ్లి, నేరుగా విత్తే వరి పద్ధతుల ద్వారా సాగు చేస్తున్న పంటలను చూపించారు. అనంతరం మట్టి పరీక్షా కిట్లు, విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ శ్రీనివాస్, రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ ఎస్. కవి రాజు, వికాసిత్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఏర్పుల నరసింహ, అజయ్, సాయికిరణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు. మంచాల గ్రామ రైతులు అశ్వాల బాల్రాజ్, పసుల కృష్ణ, గడ్డం బాబయ్యా, గొరిగే నరసింహ, మెరుగు బిక్షపతి, మొగిలి మహేష్, గడ్డం రాములు, రావుల వినోద్ కుమార్, కొనాల మల్లేష్, చీర దానయ్య, సత్తయ్య, బాసయ్య, బుగ్గయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్లు డోఖా చేసి ఇప్పుడు బాకీ కార్డులా?



**కరీంనగర్, అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో ప్రజలను మోసం చేసి, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై బాకీ కార్డులు పంచడం ఎంతవరకు సమంజసమని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం నగరంలోని డివిజన్లలో కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం కోసం 60 ఏళ్ల పాటు ప్రజలు చేసిన పోరాటాన్ని సోనియా గాంధీ నెరవేర్చినప్పటికీ, బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసి అప్పులపాలు చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో నెరవేర్చని హామీలను ఒకవైపు, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మరోవైపు పొందుపరిచి కార్డులు పంపిణీ చేశామని తెలిపారు. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు ముందుగా క్షమాపణ చెప్పాలి. డోఖా చేసినందుకు, రాష్ట్రాన్ని అప్పుల పాలుచేసినందుకు బాధ్యత వహించాలి. ప్రజా పాలన అందిస్తున్న కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరించారు. ప్రజలు బీఆర్ఎస్ నాయకుల నాటకాలను గమనిస్తున్నారని, వారి వైఖరి మారకపోతే ప్రజలే తరిమికొడతారని అన్నారు. నగరంలోని అన్ని డివిజన్లలో కార్డులు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొరివి అరుణ్ కుమార్, కుర్ర పోచయ్య, యనమల మంజుల, ఆమెర్, దండి రవీందర్, తంగెళ్ల కిరణ్, ఆస్తాపురం రమేష్, నెల్లి నరేష్, మేరాజ్, షబానా మహమ్మద్, ముల్కల కవిత, అస్తాపురం తిరుమల, జూపాక సుదర్శన్, కీర్తి కుమార్, కొట్టే ప్రభాకర్, మహమ్మద్ భారీ, బషీర్, ఖలీల్, తోట అంజయ్య, నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికులకు పన్నెండు వేల రూపాయలు ఇవ్వాలి: జాగృతి



**కరీంనగర్, అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆటో కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మండిపడ్డారు. ఎన్నికల ముందు సంవత్సరానికి 12,000 ఇవ్వాలని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఎగనామం పెడుతోందని విమర్శించారు. ఉచిత బస్సు, రాపిడో సేవల వల్ల ఆటో డ్రైవర్లు బజారున పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే హెల్త్ కార్డులు, ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. దీపావళి వరకు హామీ నెరవేర్చకపోతే జాగృతి అధ్యక్షురాలు కవిత నేతృత్వంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆటో కార్మిక సంఘం నాయకుడు కొత్తురి రఘుతో పాటు పలువురు సభ్యులు జాగృతిలో చేరారు. కార్యక్రమంలో యండి హుసైన్, రమేష్, వెంకటేష్, మహేష్, యండి ఖాజా, గొల్లపల్లి రత్నకర్, యండి రాజీ, గర్షకుర్తి విద్యాసాగర్, కొత్వాల అంజనేయిలు తదితరులు పాల్గొన్నారు.

# వైకుంఠ రథం కోసం ప్రజల అవస్థలు తీరేనా?





**కరీంనగర్, అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిరుపేద ప్రజల కోసం మంచి ఉద్దేశంతో కరీంనగర్ నగరపాలక సంస్థ ప్రవేశపెట్టిన "ఒక రూపాయితో అంత్యక్రియల పథకం" వాస్తవానికి ప్రజలకు ఉపయోగపడాల్సినదే. కానీ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ పథకం లక్ష్యాన్ని చేరుకోలేకపోతుంది. పేదవారు ఈ సేవను పొందేందుకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ పథకానికి బాధ్యతలను డివిజన్ అధికారికి అప్పగించడంతో సమస్యలు మొదలయ్యాయి. ఆయనకు స్థానిక ప్రజలతో సంబంధం లేకపోవడం, మరణించిన కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా స్పందించకపోవడం, ఏ అధికారి వద్దకు వెళ్లినా "ఆఫీసర్ను సంప్రదించండి" అనే మాటలతో పంపించేస్తుండటం వల్ల బాధితులు బల్దియా చుట్టూ తిరుగుతూ మరింత కష్టాల్లో పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో, డివిజన్ ప్రజలు మున్సిపల్ కమిషనర్‌ను కోరుతున్నది ఏమిటంటేఈ పథకానికి బాధ్యతలను నిత్యం పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ ప్రజలతో నిత్య సంబంధాలు కలిగి ఉన్న డివిజన్ జవాన్‌కు అప్పగించాలనేది. అతనికి స్థానికుల వివరాలు, చిరునామాలు, ఆధార్, రేషన్ కార్డు వంటి సమాచారం తెలిసి ఉండటంతో, అవసరమైన సమాచారం సేకరించి వెంటనే స్పందించగలడు. దీంతో పథకం వేగంగా అమలవుతుంది. ఈ పథకం ఏ కార్పొరేటర్ వల్ల గానీ, డివిజన్ నాయకుల వల్ల గానీ నడవడం లేదు. ఇది పూర్తిగా నగరపాలక సంస్థకు చెందినదిగా భావించి, మున్సిపల్ కమిషనర్ తగిన నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని వెలిబుచ్చిన కోడూరి రవీందర్ గౌడ్, పేద ప్రజల కోసం రూపొందించిన ఈ పథకం వాస్తవంగా వారికి చేరాలంటే, బాధ్యతలు సరైన వ్యక్తికి అప్పగించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

# తపాలా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ




**కరీంనగర్, అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రపంచ తపాలా దినోత్సవం-2025 మరియు జాతీయ తపాలా వారోత్సవం-2025 సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ కప్పల శివాజీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌష్ ఆలం తపాలా శాఖ అధికారులను అభినందించారు. శివాజీని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పోస్టల్ శాఖ సిబ్బంది, యంగ్ ఇండియా మిషన్, సేఫర్ ఇండియన్ రోడ్స్, ఐవైఎస్ఓ, ఏసిటి ఇండియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎం ఆర్ సి బి 13 వ వార్షికోత్సవ వేడుకలు





**హైదరాబాద్, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)** :హైదరాబాద్ చందానగర్ లోని ఎం ఆర్ సి బి 13 వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్సీబీ చైర్మన్ డా. తక్కలపల్లి సత్యనారాయణ రావు, డైరెక్టర్ మట్టపల్లి మోహన్ రావు, ఎమ్మార్సీబి సిబ్బందితో కలిసి ఎం ఆర్ సి బి ఫౌండర్ మట్టపల్లి వాసుదేవారావు కేక్ కట్ చేసి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కస్టమర్లు, శ్రేయోభిలాషులు, బంధుమిత్రులు యాజమాన్యానికి శాలువా కప్పి ఘనంగా సన్మానం చేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ తక్కలపల్లి సత్యనారాయణ రావు మాట్లాడుతూ చందానగర్లో ఎమ్మార్సీబీ ని నెలకొల్పి 12 సంవత్సరాలు పూర్తి చేసుకుని 13వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా కస్టమర్లకు, బందు మిత్రులకు, శ్రేయోభిలాషులకు 13వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తన 25 సంవత్సరాల ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్నారు. మాది వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామమని, హైదరాబాద్ కు రాకముందు గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే వాడినని తెలిపారు. అప్పుడు వ్యవసాయం కలిసి రాకపోవడంతో 25 సంవత్సరాల క్రితం హైదరాబాద్ కు రావడం జరిగిందని తెలిపారు. మొదటగా నల్లకుంటలో ఎమ్మార్సీబి లో 12 సంవత్సరాలు మేనేజ్ మెంట్ చేసిన తరువాత చందానగర్లో ఎమ్మార్సీబీని ప్రారంభించడం జరిగిందన్నారు. ఇక్కడ ఎం ఆర్ సి బి ప్రారంభించి 12 సంవత్సరాలు పూర్తయిందని తెలిపారు. 25 సంవత్సరాల ప్రయాణంలో ఎమ్మార్సీబీలో పనిచేసిన వారికి శిక్షణ ఇస్తూ సుమారు 25 షాపులు పెట్టించి వారి కాళ్లపై వాళ్లు నిలబడే విధంగా ప్రోత్సహించడం జరిగిందన్నారు. మన నగరం అవార్డుతో పాటు డాక్టరేట్ పొందడం సంతోషకరమన్నారు. 40 సంవత్సరాల క్రితమే ఉత్తమ రైతుగా అవార్డు తీసుకున్నానని, ఇప్పటికి రసాయన ఎరువులు వాడకుండా మా స్వగ్రామం ఇల్లంద లో వ్యవసాయం చేస్తున్నానని తెలిపారు. కస్టమర్లకు నాణ్యమైన ఆహారం అందించేందుకు ఎప్పుడు ముందు వరుసలో ఉంటానని తెలిపారు. ఎం ఆర్ సి బి లో ఎలాంటి అనుభవం లేని నాకు అన్ని తానై వాసుదేవరావు, కస్టమర్లు అందించిన ప్రోత్సాహం ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. వీరితోపాటు మట్టపెల్లి మోహన్ రావు, ఎం ఆర్ సి వి సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# జూనియర్ అసిస్టెంట్లకు తీపి కబురు...

- ❖ సర్వీసు క్రమబద్ధీకరణకు లైన్ క్లియర్
- ❖ జేఏసీ వినతిపై స్పందించిన సీసీఎల్ఏ
- ❖ సర్వీసు క్రమబద్ధీకరణపై కలెక్టర్లకు మార్గదర్శకాలు



**హైదరాబాద్, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):** జూనియర్ అసిస్టెంట్లకు సర్వీసు క్రమబద్ధీకరణకు లైన్ క్లియర్ అయ్యింది. వారి సర్వీసు క్రమబద్ధీకరణపై సీసీఎల్ఏ ఉన్నాతాధికారులు కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జూనియర్ అసిస్టెంట్ల నియామకం జరిగి 2025 ఆగస్టు 9 నాటికి రెండు సంవత్సరాలు పూర్తయినది. కానీ వారి సర్వీసు క్రమబద్ధీకరణపై స్పష్టత లేదు. ఈ క్రమంలోనే తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి ఆద్వర్యంలో జూనియర్ అసిస్టెంట్ల సర్వీసు ను క్రమబద్ధీకరించాలని టీజీటీఏ, టీజీఆర్ఎస్ఏ ప్రతినిధులు సీసీఎల్ఏ కమిషనర్‌కు వినితిపత్రం అందించారు. అలాగే జిల్లాల కలెక్టర్లు కూడా సీసీఎల్ఏ కమిషనర్‌ను కోరారు. వీటిపై స్పందించిన సీసీఎల్ఏ కమిషనర్ జూనియర్ అసిస్టెంట్ల క్రమబద్ధీకరణపై కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బదిలీ ద్వారా నియామకం అయిన జూనియర్ అసిస్టెంట్లు కేడర్ కు తెలంగాణ రాష్ట్ర సబార్డినేట్ సర్వీస్ రూల్స్, 1996 యొక్క రూల్ నెం.16 (C) (ii) వర్తిస్తుందని తెలియజేశారు. బదిలీ ద్వారా నియామకం కాబడిన ఉద్యోగులకు ఒక సంవత్సరం ప్రొబేషన్‌లో ఉంటుందని కలెక్టర్లకు జారీ చేసిన ఆదేశాలలో స్పష్టంగా తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి, డీసీఏ జనరల్ సెక్రటరీ కెతావత్ రామకృష్ణ, టీజీటీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, టీజీఆర్ఎస్ఏ అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.బిక్షం సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్‌కుమార్ కి, సీసీఎల్ఏ సెక్రటరీ మంద మకరందు గారికి, సీసీఎల్ఏ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# అల్ఫోర్స్ స్కూల్‌లో ఘనంగా వరల్డ్ ఎక్స్పో-2025



**కరీంనగర్, అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో వరల్డ్ ఎక్స్పో-2025 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు సామాజిక అవగాహన పెంపొందించేందుకు పాఠ్యాంశ ప్రణాళికలో భాగంగా వివిధ దేశాల విద్యా, రాజకీయ, ఉపాధి, సాంస్కృతిక అంశాలపై ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. "మన ప్రపంచం -మన అద్భుతం-మన జీవితం" నాటిక ఆకట్టుకుంది.భారతదేశంతో పాటు అమెరికా, రష్యా, జపాన్, దుబాయ్, పారిస్, లండన్, చైనా తదితర దేశాలపై విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమాన్ని తల్లిదండ్రులు ప్రశంసించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా మేకల బాలకృష్ణారెడ్డి పుట్టిన రోజు వేడుకలు

❖ తెలంగాణ భూముల పరిరక్షణ సమితి అధ్యక్షులు గోడుకొండ్ల ప్రవీణ్ సమక్షంలో కేక్ కట్ చేసిన యువకులు



**యాచారం అక్టోబర్ 11( నీలగిరి ఎక్స్ప్రెస్) :-** యాచారం మండలం మొండిగౌరెల్లి గ్రామ బీజేపీ యువ నాయకులు మేకల బాలకృష్ణారెడ్డి పుట్టిన రోజు వేడుకలు తెలంగాణ భూముల పరిరక్షణ సమితిచైర్మన్ పల్లపు విజయ్, అధ్యక్షులు గోడుకొండ్ల ప్రవీణ్ సమక్షంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు సందర్భంగా మిత్రులు, సన్నిహితులు, కుటుంబ సభ్యుల నడుమ పెద్ద ఎత్తున కార్యక్రమం చేపట్టి బాణాసంచా కాల్చుతూ,కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. గ్రామస్థుల,స్థానిక కాలనీ వాసులు శుభాకాంక్షలు తెలిపారు. మేకల బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ నా పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. పలువురు ప్రజాప్రతినిధులు శాలువా తో సన్మానించారు. ఈకార్యక్రమంలో మొండిగౌరెల్లి గ్రామ యువకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ నగర్ అభివృద్ధికి శేరి ఫౌండేషన్ అండ



**కూకట్‌పల్లి, అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మూసాపేట డివిజన్‌లోని అంబేద్కర్ నగర్ బస్తీలో శనివారం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి పర్యటించారు. కమ్యూనిటీ హాల్ శిథిలావస్థ, సీసీ కెమెరాల పనితీరు వంటి సమస్యలను పరిశీలించిన ఆయన, హాల్ మరమ్మతులు, పెయింటింగ్, యువత కోసం జిమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ అభివృద్ధి పనులను శేరి రాజీవ్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టనున్నట్టు ప్రకటించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు భరోసా ఇచ్చారు. బస్తీ ప్రజలు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మేకల మైకల్, మహమ్మద్ జున్ను పాషా, రఘుపతి రెడ్డి, అశోక్ ముదిరాజ్, కిట్టు, జెర్రిపాటి రాజు, మొయిజ్, సతీష్, నర్సింగ్ రావు, నిఖిల్, శివ, టీంకు, సాయి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు చోరి నిరోధానికి అవగాహన కల్పించాలి



**గాజులరామారం, అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఏఐసీసీ ఆదేశాల మేరకు గాజులరామారం డివిజన్‌లోని బాలాజీ లేఔట్‌లో ఓటు చోరి నిరోధంపై అవగాహన సంతకం ప్రచారం సమావేశం నిర్వహించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్ట రాగమయి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కెకెఎం ట్రస్ట్ చైర్మన్, కాంటెస్టెడ్ కార్పొరేటర్ కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కూన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో బలమైన ఆయుధమని, ఓటర్ జాబితాలో తమ పేరు, ఛాయాచిత్రాలను ప్రతి ఒక్కరు జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు.కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, వాసు, శ్రీనివాస్ రెడ్డి, అంజి, ప్రసాద్, నరేష్ గౌడ్, ఉషారాణి, సుజాతతో పాటు సత్తుపల్లి, గాజులరామారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డాక్టర్ అంజలీ నింబాల్కర్‌ను కలిసిన కూన శ్రీశైలం



**మేడ్చల్, అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మేడ్చల్ పట్టణంలోని డీసీసీ భవన్‌లో జాతీయ కాంగ్రెస్ నాయకురాలు, ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ అంజలీ నింబాల్కర్‌ను మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ బలోపేతంపై డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జులు మైనంపల్లి హనుమంత్ రావు, బండి రమేష్, తోటకూర వజ్రేశ్ యాదవ్, పరమేశ్వర్ రెడ్డి, కోలన్ హనుమంత్ రెడ్డి, శ్రీరంగం, భూపతి రెడ్డి, నక్క ప్రభాకర్, విజయ రెడ్డి తదితరులతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# మాడుగులలో అక్రమ ఇసుక రవాణా



**మాడుగుల, అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాడుగుల మండలంలోని అవురుపల్లి గ్రామ శివారులో శనివారం తెల్లవారుఝామున మూడున్నర గంటల సమయంలో గస్తీ నిర్వహిస్తున్న మాడుగుల పోలీస్ సిబ్బంది, నల్లవారిపల్లి దిశగా వెళ్తున్న ఒక ట్రాక్టర్‌ను అనుమానాస్పదంగా గుర్తించి ఆపి తనిఖీ చేశారు.ట్రాక్టర్ ట్రాలీలో ఇసుక నింపబడినట్లు గుర్తించగా, డ్రైవర్‌ను అనుమతుల గురించి ప్రశ్నించగా అతను ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నట్లు వెల్లడించాడు. ట్రాక్టర్ ఇంజిన్ నంబర్ TS31TA 4526, ట్రాలీ నంబర్ TS31TA 4527గా నమోదు అయింది. డ్రైవర్ వివరాలు తెలుసుకోగా, అతని పేరు పబ్బతి మల్లేష్, తండ్రి పేరు కృష్ణయ్య, వయసు 35 సంవత్సరాలు, వృత్తి డ్రైవర్, నివాసం నల్లవారిపల్లి గ్రామం, మాడుగుల మండలం, రంగారెడ్డి జిల్లా అని తెలిపారు.అనుమతులు లేకుండా ఇసుక తరలించినందుకు అతనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నామని మాడుగుల పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్ తెలిపారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు వ్యతిరేకంగా ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

❖ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గం పర్వతాలు



**కల్వకుర్తి, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు వ్యతిరేకంగా ఉన్న కేంద్ర బిజెపి ప్రభుత్వం గద్దె దింపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గం పర్వతాలు అన్నారు కల్వకుర్తి పట్టణంలో మహబూబ్ నగర్ చౌరస్తా దగ్గర నిరసన కార్యక్రమం నిర్వహించారు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జీవోతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై హైకోర్టు స్టే విధించడంతో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోవడానికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వమేనని విమర్శించింది. ఇప్పటికైనా రాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు నైతిక బాధ్యత వహించి, వారి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం కోరే శక్తులు, ప్రజాస్వామిక వాదులంతా కేంద్ర ప్రభుత్వాన్ని గద్దెదింపేందుకు పోరాటాలకు సన్నద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు. బీసీ రిజర్వేషన్ల 42 శాతం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయబద్ధమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కులగణన, సర్వే నిర్వహించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు కేంద్రానికి పంపించినా స్పందించలేదని విమర్శించారు. శాసనసభలో అన్ని పార్టీలూ ఏకగ్రీవంగా ఆమోదించి ఆర్డినెన్స్ చేసి గవర్నర్‌కు పంపించినా ఆమోదించకపోవడం వల్లే రిజర్వేషన్లు ఆగిపోయాయని తెలిపారు. బీజేపీ కులతత్వ, మనువాద పార్టీ అయినందున, కుల వ్యవస్థ, అసమానతలు ఉండాలనీ, మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని కోరుకుంటున్నదని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు రావాల్సిన హక్కులను కాలరాస్తున్నదని విమర్శించారు. రాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కేంద్రంపై ఒత్తిడి తేవడానికి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదని తెలిపారు. కేంద్రంలో అధికారంలో బీజేపీ ఉండడం వల్లే ఈ రిజర్వేషన్లు అమలు కాని పరిస్థితి ఏర్పడిరదని పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కావాలంటే రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీకి పుట్టగతులు లేకుండా చేస్తేనే సాధ్యమవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ శ్రీనివాస్, బి ఆంజనేయులు సిపిఎం సీనియర్ నాయకులు ఏపీ మల్లయ్య సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బాలస్వామి శంకర్ నాయక్ శివ వర్మ ,సిపిఎం జిల్లా నాయకులు మధు, రాములు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఉద్యోగ భద్రతపై బిఎంఎస్ పోరాటం



**రామగుండం, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రామగుండం ఆర్‌జీ -3 ఏరియాలో బిఎంఎస్ కోల్ మైన్స్ కార్మిక సంఘం నూతన కార్యాలయాన్ని జాతీయ కోల్ సెక్టార్ ఇంచార్జ కొత్త కాపు లక్ష్మారెడ్డి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తిలో సగభాగం పర్మినెంట్ కార్మికులే ఉండాలని, ఉద్యోగ భద్రత కోసం పార్లమెంట్ వేదికగా పోరాటం కొనసాగుతోందన్నారు. సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం కలిసి కార్మికుల వారసత్వ ఉద్యోగాలను అడ్డుకుంటున్న కుట్ర జరుగుతోందని, మెడికల్ బోర్డు నిలిపివేతపై సమగ్ర సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు మరో ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని అప్పాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బొగ్గు గనుల వేలంపాటలో పాల్గొనాలని బిఎంఎస్ సూచించింది. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి సింగరేణికి గనులు కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. ఎక్స్గ్రేషియా ?15 లక్షల నుండి 25 లక్షలకు పెంపు, 9250 దీపావళి బోనస్ సాధించామని తెలిపారు. వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ ఇండియా తరహాలో వేతనాలు, బీమా, క్వార్టర్స్, విద్యా సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరుకల ప్రసాద్, రౌత్ రమేష్, బిఎంఎస్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# గుమ్ముల మోహన్ రెడ్డికి డిసిసి పగ్గాలు ఇవ్వాలని అధిష్టానానికి వినతి పత్రం అందజేసిన కాంగ్రెస్ నాయకులు

**నల్లగొండ అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నల్లగొండ జిల్లా డిసిసి ఎన్నిక ప్రక్రియలో భాగంగా శనివారం నల్గొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏఐసీసీ మాజీ జనరల్ సెక్రెటరీ విశ్వరాజన్ మహంతి, ఏఐసిసి కార్యదర్శి, జిల్లా అబ్జర్వర్ సంపత్ కుమార్, ఎమ్మెల్సీ శంకర్ నాయకులు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించి బిశ్వరాజన్ మహంతి,

**ఏఐసిసి మాజీ జనరల్ సెక్రెటరీ మాట్లాడుతూ**
డిసిసి అధ్యక్షుని ఎంపిక పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని ప్రజాస్వామ్య యుతంగా,పార్టీ నాయకులు, కార్యకర్త మనోభావాలను, అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని డిసిసి అధ్యక్షుని నియామకం చేపట్టడం జరుగుతుందని అందులో భాగంగానే మొట్టమొదటగా నల్గొండ నియోజకవర్గంలో మొదటి సమావేశం నిర్వహించామని
అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసేలా కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంటుంది డిసిసి అధ్యక్షుడు నియామకం తర్వాత బ్లాక్,మండల, గ్రామస్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఎంపిక నిర్వహిస్తామన్నారు జిల్లాలో 10 రోజులపాటు పర్యటించి వివిధ నియోజకవర్గాలలో నాయకులు, కార్యకర్తలు అభిప్రాయాలను తీసుకుంటామని రాహుల్ గాంధీ




దిశా నిర్దేశంతో పారదర్శకంగా డిసిసి అధ్యక్షుని ఎంపిక చేయడం జరుగుతుంది కాంగ్రెస్ పార్టీ ఆలోచనలకు అనుగుణంగా పార్టీకి అంకితభావంతో పనిచేసే వారిని,అందరినీ సమన్వయంతో పార్టీని ముందుకు నడిపించే వ్యక్తిని ఎంపిక చేయడం జరుగుతుం రాజకీయ సమీకరణలను, అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని దరఖాస్తులను ఏఐసిసికి అందజేయడం జరుగుతుందని తెలిపారు.

**ఏఐసిసి సెక్రటరీ, జిల్లా అబ్జర్వర్ సంపత్ కుమార్**
దేశ చరిత్రలో మొట్ట మొదటి సారిగా కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య యుతంగా, పారదర్శకంగా డిసిసి అధ్యక్షులను ఎంపిక చేస్తుందని సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలలో డీసీసీ అధ్యక్షుల ఎంపికకు సమావేశాలు నిర్వహిస్తున్నామని ,ఉమ్మడి నల్గొండ జిల్లా సంఘటన సృజన అభియాన్ పరిశీలకుడిగా తాను డిసిసి అధ్యక్షుడు నియామకం కోసం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల అభిప్రాయాలను తీసుకుంటున్నానని పార్టీలో ఎవరైనా డిసిసి అధ్యక్షుని కోసం దరఖాస్తు చేసుకోవచ్చు డిసిసి అభ్యర్థి ఎంపికకు సంబంధించి పార్టీ శ్రేణులు వ్యక్తిగతంగా కానీ,సమిష్టిగా కానీ తమ అభిప్రాయాలను చెప్పవచ్చుని
తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ ఇంట్లో కూర్చుని అభ్యర్థిని ఎంపిక చేస్తుందని,బిజెపి అమిత్ షా కనుసైగాతో అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది కానీ కాంగ్రెస్ పార్టీలో మాత్రం పారదర్శకంగా డిసిసి నియామకం జరుగుతుందని ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ దిశా ప్రజాస్వామ్య యుతంగా, పార్టీ కార్యకర్తల అభిప్రాయం మేరకు డిసిసి అధ్యక్షుని ఎన్నిక చేయడం జరుగుతుంది తెలిపారు

**కేతావత్ శంకర్ నాయక్, ఎమ్మెల్సీ**
కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన వ్యక్తికి, అందరినీ కలుపుకునే వ్యక్తికి, అందరి అభిప్రాయాలను తీసుకొని డిసిసి అధ్యక్షుడిని ఎంపిక చేయడం జరుగుతుందని,ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సహకరించాలని తెలిపారు నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డికి ఇవ్వాలని నియోజకవర్గ పార్టీ కార్యకర్తలంతా ఏకగ్రీవంగా విశ్వరాజన్ మహంతి, సంపత్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు ఏకగ్రీవ తీర్మానం చేస్తూ వారికి దరఖాస్తు అందజేశారు.

# జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పై దాడి మత ఉన్మాదుల హేయకృత్యం

**నల్లగొండలో రౌండ్ టేబుల్ సమావేశంలో సామాజిక, ప్రజా సంఘాల తీవ్ర ఖండన**

**నల్లగొండ అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
నల్లగొండ ఎం.వి.ఎన్ ట్రస్ట్ భవనంలో కెవిపిఎస్ మరియు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం శనివారం జరిగింది. సమావేశానికి డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున మాట్లాడుతూ 'దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులోనే భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్ పైన మతోన్మాది న్యాయవాది షూ విసిరే ప్రయత్నం చేయడం దేశ చరిత్రలో చీకటి రోజు. ఇది రాజ్యాంగ వ్యవస్థపై జరిగిన దాడి" అని పేర్కొన్నారు.

**న్యాయమూర్తిపై దాడి అంటే రాజ్యాంగంపై దాడి.**
నిందితుడు రాకేష్ కుమార్‌ను వెంటనే అరెస్టు చేసి, వెనుక ఉన్న ఆర్ఎస్ఎస్-సంఘ్ పరివార్ శక్తులను



బయటపెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
దాడిని స్వతంత్ర న్యాయవ్యవస్థను దెబ్బతీయాలనే కుట్రగా చూడాలని అన్నారు.సనాతన ధర్మం పేరుతో హింస, మతోన్మాదం ప్రోత్సహించబడుతోంది అని విమర్శించారు. రాజ్యాంగ ధర్మం కంటే ఈ దేశంలో మరే ధర్మం గొప్పది కాదు. న్యాయవ్యవస్థపై దాడి సాధారణం కాదు ు ఇది ప్రజాస్వామ్యం, లౌకికతపై దాడి" అని ఆయన స్పష్టం చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు చెన్నపాక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సనాతన ధర్మం పేరుతో మను ధర్మాన్ని రుద్దే ప్రయత్నమే ఇది. షెడ్యూల్డ్ కాస్ట్ మేధావి జస్టిస్ గవాయ్ సుప్రీంకోర్టు చీఫ్‌గా ఉండడం బీజేపీకి జీర్ణం కావడం లేదు. అంబేద్కర్ రాజ్యాంగ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన సమయం వచ్చింది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో గీతకార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కొండా వెంకన్న, సిఐటియు నాయకులు దండంపల్లి సత్తయ్య, నాయకులు బొడ్డుపల్లి వెంకటేష్ డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి గుండాల నరేష్ డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్టా లింగస్వామి ఉప్పుల గోపాలు జగన్ చంద్రశేఖర్ శ్రీనివాస్ రాధాకృష్ణ జితేందర్ యాదగిరి శివ తదితరులు మాట్లాడుతూ సంఘ్ పరివార్ శక్తుల మతవాద దాడులను ఖండించారు.
న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడే బాధ్యత దేశ ప్రజలందరిదని, అన్ని ప్రజాస్వామిక శక్తులు ఒకే వేదికపై రావాలని పిలుపునిచ్చారు.


# మల్లు రవిని కలిసిన వెల్జాల్ కాంగ్రెస్ నేతలు



**తలకొండపల్లి, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తలకొండపల్లి మండలంలోని వెల్జాల్ గ్రామ కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లోని ఎంపీ డాక్టర్ మల్లు రవిని అక్టోబర్ 11న మర్యాదపూర్వకంగా కలిశారు. వెల్జాల్, మాదాయపల్లి గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన మల్లు రవి, త్వరలోనే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జి. శ్రీనివాసమూర్తి, చెర్ల వెంకట్ రెడ్డి, ఏ. మధుసూదన్ రెడ్డి, ఆయిల్ అంజయ్య గౌడ్, మల్లి కేడీ అంబాజీ, బి. నర్సింలు, ఎం.ఎ. అజీజ్, పి. అశోక్ బాబు, ఏ. వెంకటరెడ్డి, ఎం.డి. ఆరిఫ్, టి. కృష్ణయ్య గౌడ్, ఏ. కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# చెట్టు ఢీకొని కారు దగ్ధం

**చిగురుమామిడి, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):**



కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి శివారులోని పెసరుపల్లె వద్ద శుక్రవారం రాత్రి కారు ప్రమాదం జరిగింది. జనగామ నుంచి కొండగట్టుకు వెళ్తున్న ముగ్గురు యువకుల కారు అతివేగంతో అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి దగ్ధమైంది. పొగలు రావడంతో అటుగా వెళ్తున్న వాహనదారులు డోర్లు పగలగొట్టి యువకులను బయటకు తీసి ప్రాణాపాయం తప్పించారు. కారు పూర్తిగా కాలిపోయింది.

# రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా భీమేశ్వర ఆలయంలో ఆర్జిత సేవలు ప్రారంభం



**వేములవాడ, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం ఆర్జిత సేవలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పార్వతీ పరమేశ్వర ఉత్సవ మూర్తులను పల్లకీ సేవలో ఊరేగింపుగా భీమేశ్వర ఆలయానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోడెమొక్కు ప్రారంభించి, స్వామివారి దర్శనంతో పాటు నిత్య కళ్యాణం, నిత్య అన్నదాన సేవలను ప్రారంభించారు. భక్తుల సౌకర్యార్థం భీమేశ్వర ఆలయంలో దర్శనాలు, ఆర్జిత సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. రాజన్న ఆలయ విస్తరణ పనులకు సీఎం రేవంత్ రెడ్డి నవంబర్ 20న శంకుస్థాపన చేశారు. 42 కోట్లతో రోడ్డు వెడల్పు, 76 కోట్లతో ఆలయ విస్తరణ కొనసాగుతోంది. శృంగేరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధూశేఖర భారతి సూచనలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రాజన్న ఆలయాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయాలని, భక్తుల సహకారంతో రానున్న వందేళ్లకు భద్రత కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అక్టోబర్ 19న శృంగేరి పీఠాధిపతి వేములవాడకు విచ్చేసి స్వామివారి దర్శనం చేయనున్నారని తెలిపారు.

# ఆచారి సమక్షంలో బిజెపిలో చేరిక

**-కాంగ్రెస్ పార్టీ నుండి బిజెపి పార్టీలో చేరిన 20 మంది కాంగ్రెస్ కార్యకర్తలు**



**కడ్తాల్, అక్టోబర్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ )**
భారతీయ జనతా పార్టీ ఆమనగల్లు పట్టణ కార్యాలయంలో కడ్తాల్ పట్టణ అధ్యక్షులు మహేష్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు, మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి సమక్షంలో కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ పార్టీలో చేరారు. ఈ సందర్బంగా ఆచారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ఆకర్షితులై నరేంద్ర మోడీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆకర్షితులై యువత భారతీయ జనతా పార్టీ వైపు మోడీ నాయకత్వంలో భారతదేశం అభివృద్ధిని చూసి యువత మోడీ మార్గాన్ని ఎంచుకోవడం జరుగుతుందని, రానున్న రోజుల్లో భారతీయ జనతా పార్టీ వైపే తెలంగాణ ప్రజల చూపు అని ఆచారి దిమా వ్యక్తం చేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలో త్వరలో భారీ ఎత్తున చేరికలు ఉంటాయని పత్రిక ముఖంగా తెలియజేయడం జరిగింది. స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బిజెపి పార్టీ చేర్ల నాయకులను కార్యకర్తలను దిశా నిర్దేశం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కడ్తాల్ మండల బిజెపి పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# భద్రతా ప్రమాణాలు పాటించని పరిశ్రమలపై ఉక్కుపాదం




**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి పరిశ్రమ భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాల్సిందేనని ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ డైరెక్టర్ వై. మోహన్ బాబు స్పష్టం చేశారు. జీడిమెట్ల ఇండస్ట్రియల్ అసోసియేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో కౌన్సిల్ ఆఫ్ ఈ హెచ్ఎస్ ప్రొఫెషనల్స్ (సీఈపీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఒకరోజు శిక్షణా తరగతుల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి కార్మికుని ప్రాణం విలువైనదని, ప్రమాదాల నివారణకు యాజమాన్యాలు శిక్షణా తరగతులు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రమాదాల తర్వాత నివేదికలు కాదు, ప్రమాదాలు జరగకుండా చూడడమే ముఖ్యమని తెలిపారు. భద్రతా ప్రమాణాలు పాటించని పరిశ్రమలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు తపస్ సాహ మాట్లాడుతూ, చిన్న వాట్సాప్ గ్రూప్‌గా ప్రారంభమైన సంస్థ నేడు వేల మందికి శిక్షణ అందిస్తూ పరిశ్రమల భద్రతకు తోడ్పడుతోందన్నారు. యాజమాన్యాల సహకారంతో ప్రతి శిక్షణా కార్యక్రమం ప్రభుత్వ దృష్టికి తీసుకెళు న్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆరోభిందో, ఆపిటోరియా, గ్రాన్యూవల్స్, 3ఎం, వియాష్ లైఫ్ సెన్స్ సంస్థల ప్రతినిధులతో పాటు సుమారు 72 పరిశ్రమల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. శిక్షణ తరగతులు క్రింది స్థాయి ఉద్యోగులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

# వడ్డీ వ్యాపారి బాలాజీ నాయక్ అరెస్ట్

**❖ ఎస్పీ శరత్ చంద్ర పవార్**

**నల్లగొండ అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**




తండా వాసులే లక్ష్యంగా చేసుకొని మాయ మాటలతో బురిడీ కొట్టిస్తూ నిరక్షరాస్యులైన గిరిజన తండా ప్రజలకు అధిక వడ్డీ ఆశ చూపించి వచ్చిన డబ్బులతో విలాసవంతమైన జీవితతో, జల్సాలు చేసేవాడని ఎస్పీ శరత్చంద్ర పవార్ తెలిపారు.అధిక వడ్డీ పేరుతో 50 కోట్ల మోసం వరకు మోసం చేసిన రామవత్ బాలాజీ నాయక్ అరెస్ట్ చేశారు గుడిపల్లి పోలీస్ స్టేషన్లో ునిందితుడి పై మూడు కేసులు నమోదు (Cr.No 153,154,157/2025). సెక్షన్లు: 316(2), 318(4) BNS & TS Protection of Depositors Act...
దాదాపుగా 106 మంది ప్రజలను మోసం చేసినట్టు లెక్కలు బహిర్గతం అయినట్లు తెలిపారు నిందితుడి వద్ద నుండి ఖరీదైన ఫార్చునర్, స్కార్పియో కార్లు, విలువైన ఆస్తి పత్రాలు, 7 సెల్‌ఫోన్లు, 113 ప్రామిసరీ నోట్లు స్వాధీనం చేసుకున్నారని జనాలను మోసం చేసి సమకూర్చిన మిర్యాలగూడ, హయత్‌నగర్, దామరచర్ల ప్రాంతాల్లో ఇళ్లు -భూములు జప్తు చేసినట్లు తెలిపారు .రియల్ ఎస్టేట్, స్టాక్ మార్కెట్, సాఫ్ట్‌వేర్ కంపెనీ పెట్టుబడులు పెట్టి నష్టపోయినట్లు తెలిపారు గ్రామ ఏజెంట్ల ద్వారా నిరక్షరాస్యులైన గిరిజన తండాల ప్రజలు అధిక వడ్డీ ఆశతో మోసపోవద్దని బాదితులు నేరుగా పోలీసులను సంప్రదించాలని బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు ఇంకా బాధితులు ఎవరైనా ఉన్నట్లయితే పోలీస్ శాఖ వారిని సంప్రదించాలని తెలిపారు.

## బిసిలకు రిజర్వేషన్లు కల్పించిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలి'



**నల్లగొండ, అక్టోబర్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఈ నెల 14న జరిగే 'రాష్ట్ర వ్యాప్త బంద్' ను విజయవంతం చేయాలని నల్లగొండ జిల్లా కేంద్రంలో ఉన్న అమరవీరుల స్థూపం వద్ద పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్ధన్ గౌడ్ మాట్లాడుతూ బిసిల 42 శాతం రిజర్వేషన్లపై జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా ఈ నెల 14న జరిగే 'రాష్ట్ర వ్యాప్త బంద్' చరిత్రలో ఎన్నడు జరగని విధంగా బిసి లోకం చేపట్టాలని గ్రామాల్లో సైతం ఈ బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు చట్ట సభలలో రిజర్వేషన్లు సాధించేంతవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు.ఈ ఉద్యమం ప్రజాస్వామ్య బద్ధంగా బిసిల ఆత్మగౌరవం కోసం, అవమానాలకు వ్యతిరేకంగా కొనసాగుతుంది అన్నారు. హైకోర్టు ఎన్నికల ప్రక్రియను ఆపడం దురదృష్టకరమని ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యాక ఎన్నికలను అపరాదని, గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయని, ఆ ఆదేశాలకు విరుద్ధంగా వాయిదా వేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. ఈ నిర్ణయిం రాష్ట్రంలోని 56 శాతం బిసి ప్రజల హక్కులకు విఘాతం కలిగి స్తుందని, బీసిల ఆత్మగౌరవం దెబ్బతినడమేనని ఆవేదన వ్యక్తం చేశారు.
రాష్ట్రజి

## ఆటో డ్రైవర్స్ కు అవగాహనా కల్పిస్తున్న ఎస్ ఐ.

-ఆటో డ్రైవర్స్ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
-ఎస్ ఐ మధుకర్.



**ఎలిగేడు, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా చేర్చాలని ఎస్ ఐ మధుకర్ అన్నారు. మండల కేంద్రం లో ని ఆటో స్టాండ్ సంబందించిన డ్రైవర్స్ కు పలు అంశాల పై అవగాహనా కల్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు ఆటో డ్రైవర్స్ పాటించాలసిన నిబంధనలు వివరించారు.నలుగురికన్నా ఎక్కువ మంది ని తరలించ వద్దని డ్రైవర్ పక్కన ఎవ్వరు కూర్చో రాదన్నారు. ప్రతి రోజు ఆటో కండిషన్ లో భాగంగా బ్రేకులు టైర్ వీల్స్ ఆయిల్ ఇతరత్రా సరిచూసుకోవాలన్నారు. రోడ్డు గుండా ప్రయాణం చేసేటప్పుడు యాక్సిడెంట్స్ జరుగుతే వారిని ఫస్ట్ ఎయిడ్ నిమిత్తం సంబంధించిన ఆసుపత్రులకు తరలించి మానవత్వం చూపించాలన్నారు. అలాగే ఆటోలకు పైన హై వోల్టేజ్ బల్బులను బిగించి రాత్రిపూట ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా చూసుకుని ఆటోకు సంబంధించిన పూర్తి కాగితాలు ఉంచుకోవాలని అన్నారు. ప్రయాణికులు ఇబ్బంది గురై పోలీస్ స్టేషన్ లో ఫిటిషన్ ఇస్తే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో ఎ ఎస్ ఐ లు శ్రావణ్ కుమార్,రామచంద్రం,,శ్రీనివాస్ తదితర పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## తూప్రాన్ మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**తూప్రాన్, అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తూప్రాన్ మండల పరిధిలో ఈరోజు ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. చెట్ల కొమ్మలు తొలగింపు, సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు ఏఈ (ఆపరేషన్) తూప్రాన్ వెంకటేశ్వర్లు, ఏడీఈ (ఆపరేషన్) తూప్రాన్ శ్రీనివాస్ ప్రజలకు ముందుగానే సమాచారం అందిస్తూ, వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## కుల వివక్షపై గ్రామస్తులకు అవగాహన కల్పించిన సీఐ

**తెలకపల్లి, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**



తెలకపల్లి మండలంలోని జంగమోనిపల్లి గ్రామంలో ఇటీవల దసరా పండుగ సందర్భంగా దుర్గామాత ఆలయ దర్శనానికి ఒక కులానికి చెందినవారిని నిరాకరించారని సమాచారం. ఈ నేపథ్యంలో శనివారం గ్రామాన్ని సందర్శించిన నాగర్ కర్నూల్ సీఐ అశోక్ రెడ్డి, గ్రామస్తులతో సమావేశమై కుల వివక్షతపై చట్టపరమైన అవగాహన కల్పించారు. ప్రజలంతా స్నేహపూర్వకంగా, సమానత్వ భావనతో ఉండాలని సూచించిన ఆయన, కులం పేరుతో ఎవరైనా వివక్షత చూపినట్లయితే ఎస్సీ/ఎస్టీ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ ఎండీ. జాకీర్ ఆలీ, ఎస్సై నరేష్, ఆర్ఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ సురేందర్, కానిస్టేబుల్ ప్రభాకర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు. గ్రామంలోని అన్ని కులాల ప్రజలు, యువకులు, పెద్దలు సమావేశంలో పాల్గొని సంఘీభావం వ్యక్తం చేశారు.

## ముకరాంపుర పార్క్ కబ్జా

❖ కేంద్ర మంత్రికి వినతి



**కరీంనగర్, అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కలెక్టరేట్ సమీపంలోని రూ.8 కోట్ల విలువైన ముకరాంపుర పార్క్‌ను కబ్జాదారుల నుంచి కాపాడాలని స్థానికులు కేంద్ర మంత్రి బండికి వినతి చేశారు. నగరపాలక సంస్థ నిర్లక్ష్యం వల్లే స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని ఆరోపించారు.పార్క్‌కు బోర్డులు ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు పిర్యాదు చేశారు. చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. పార్క్ రక్షణకు ఏఐఎఫ్‌బీ ఆధ్వర్యంలో ఆందోళనకు పిలుపునిస్తామని హెచ్చరించారు.

## కిసాన్ గ్రామీణ మేళా పోస్టర్ ఆవిష్కరణ




**కరీంనగర్, అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రైతుల అభివృద్ధి లక్ష్యంగా డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో నిర్వహించనున్న "కిసాన్ గ్రామీణ మేళా 2025" పోస్టర్ మరియు బ్రోచర్‌ను ఈరోజు కరీంనగర్‌లో జరిగిన పత్రికా సమావేశంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని కిసాన్ జాగరన్ అధ్యక్షులు, ప్రముఖ రైతు నాయకులు పి. సుగుణాకర్ రావు ప్రారంభించారు.

## ఆలేరు శివాలయంలో విగ్రహం చోరీకి యత్నం




**తెలకపల్లి, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలకపల్లి మండలంలోని ఆలేరు గ్రామ శివాలయంలో శివలింగాన్ని గుర్తుతెలియని వ్యక్తులు తొలగించేందుకు యత్నించిన ఘటన కలకలం రేపింది. ఈ విషయమై ఆలయ చైర్మన్ పెండ్యాల రవీందర్రావు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. శనివారం గ్రామాన్ని సందర్శించిన నాగర్ కర్నూల్ సీఐ అశోక్ రెడ్డి, గ్రామ పెద్దలతో మాట్లాడి ఘటనపై పూర్తి సమాచారం సేకరించారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలకపల్లి ఎస్సై నరేష్ స్పష్టం చేశారు.

## బాలికల తోనే ప్రపంచానికి భవిష్యత్తు

❖ కళావతమ్మ

**వనపర్తి,అక్టోబర్ 11( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
బాలికలతోనే ప్రపంచ భవిష్యత్తు ముడివడి ఉందని ఎన్ఎఫ్ఐ డబ్ల్యు ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు మాజీ సర్పంచ్ కళావతమ్మ అన్నారు. శనివారం వనపర్తి ఆఫీస్ లో అంతర్జాతీయ బాలికల దినోత్సవం ( ఎన్ఎఫ్ఐ డబ్ల్యు) భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళా సమాఖ్య నేతలు బాలికలకు మిఠాయిలు తినిపించి శు భాకాంక్షలు తెలిపారు. మహిళలు మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్ఐ డబ్ల్యు పట్టణ కన్వీనర్ జయమ్మ అధ్యక్షతన అంతర్జాతీయ




బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలను పుట్టనిద్దాం చదవనిద్ధం ఎదగనిద్దాం అంటూ నినాదాలు చేశారు. కళావతమ్మ మాట్లాడుతూ ఈనాటి బాలికే రేపటి మహిళా అన్నారు. ఆకాశం, భూమిలో సగభాగంగా మహిళలు ఉన్నారన్నారు. వారి అభివృద్ధి లేకుండా ప్రపంచానికి మనుగడ లేదన్నారు. ఆడపిల్లలను కడుపులోనే చంపేస్తున్నారని ఈ పరిస్థితి మారాలన్నారు. మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలను పెంచాలన్నారు. సమాజంలో చిన్న చూపు పోవాలన్నారు. మగ పిల్లలతో సమానంగా అంతకంటే ఎక్కువగా ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందుకు వెళు న్నారన్నారు. కుటుంబాన్ని చక్కదిద్దటంలో మహిళల పాత్ర ఎంతో ఉందన్నారు. బాలికలను ఆరోగ్యవంతులుగా ఆదర్శంగా పెంచాలన్నారు. బాలికలు లేకుంటే సృష్టి లేదని, మానవజాతి అంతరిస్తుందన్నారు. బాలికలను సంరక్షించి ప్రపంచ మనుగడను కాపాడాలి అన్నారు. పట్టణ కన్వీనర్ జయమ్మ, జ్యోతి సుప్రియ రూప సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, చైల్డ్ ప్రొటెక్షన్ లీగల్ ఆఫీసర్ శివ, రమణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా సుస్థిర ఆరోగ్యం మరియు యువతల శ్రేయస్సు కార్యక్రమం ప్రారంభించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నల్లగొండ ,అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్గొండ జిల్లా పరిపాలన & గుడ్ యూనివర్స్ అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా, నల్గొండ జిల్లా పరిపాలన మరియు గుడ్ యూనివర్స్ సంయుక్తంగా, ఎస్‌బీఐ ఫౌండేషన్‌తో భాగస్వామ్యంగా "సుస్థిర రుతుక్రమ ఆరోగ్య మరియు యువతీ శ్రేయస్సు కార్యక్రమం" ను ప్రారంభించడాన్ని గర్వంగా ప్రకటిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న యువ బాలికలకు సుస్థిర రుతుక్రమ కిట్లు, ఆరోగ్య అవగాహన, మరియు జీవన నైపుణ్య శిక్షణలు అందించబడతాయి. ఈ కార్యక్రమం బాలికలు గౌరవంతో, ఆత్మవిశ్వాసంతో పాఠశాల విద్యను కొనసాగించేందుకు, అలాగే రుతుక్రమంపై అవగాహన మరియు సంభాషణలను సాధారణం చేయడానికి దోహదపడుతుంది. ఈ సందర్భంలో జిల్లా పరిపాలన



ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి ఇలా త్రిపాఠి నేతృత్వంలో ముఖ్య భాగస్వాములతో సమావేశం జరిగింది. కలెక్టర్ మార్గదర్శకత్వం, నాయకత్వం మరియు బాలికల శ్రేయస్సుపై ఉన్న అంకితభావం ఈ కార్యక్రమానికి ప్రేరణగా నిలుస్తున్నాయి. ఆమె మద్దతు యువ బాలికల అసలు అవసరాలను గుర్తించి, సానుభూతి, సహకారం, మరియు నిరంతర చర్యలతో వ్యవస్థలను బలోపేతం చేయాలనే సంయుక్త దృష్టిని బలపరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా అధికారి బొల్లారం బిక్షపతి , జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి కృష్ణవేణి , మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. గుడ్ యూనివర్స్ నుండి సహ వ్యవస్థాపకులు శ్రీ కమల్ మరియు మిస్ నీలోఫర్ గారు పాల్గొని, యువతీ ఆరోగ్యం మరియు శ్రేయస్సుపై తమ సమిష్టి నిబద్ధతను పునరుద్ధరించారు. ఈ భాగస్వామ్యం నల్గొండ జిల్లాలో బాలికల శ్రేయస్సు, విద్యా కొనసాగింపు, మరియు ఆరోగ్య అవగాహన దిశగా ఒక ముఖ్యమైన ముందడుగని తెలిపారు.

## విశ్వబ్రాహ్మణ ఆణిముత్యాలకు ఘన సన్మానం

**కరీంనగర్, అక్టోబర్11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ జిల్లా స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ ఆణిముత్యాలుగా గుర్తించిన పలువురు ప్రతిభావంతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం స్వర్ణకార సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించబడింది. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వ్యక్తులను గుర్తించి, వారి కృషికి గౌరవం చెల్లించడమే ఈ సన్మాన కార్యక్రమం ఉద్దేశ్యంగా నిలిచింది. జిల్లా అధ్యక్షులు కడార్ల శివప్రసాద్ మాట్లాడుతూ, పోలీస్ శాఖలో ఉత్తమ సేవారత్న అవార్డు అందుకున్న దేవరకొండ రవీంద్ర చారి, చార్టెడ్ అకౌంటెంట్ పరీక్షలో మొదటిసారి



ఉత్తీర్ణత సాధించిన పెండొట వినోద్, ఆయన తండ్రి వెంకటేశ్వర్లు, బ్రహ్మంగారి గానసుధా పాటను చిత్రీకరించిన కాయితోజు పవన్ కుమార్, రంగు గోవర్ధన చారి, స్వర్ణకారుల కన్నీటి గాధ లఘు చిత్రాన్ని రూపొందించిన అనసూరి భూమాత చారి, కట్ట సత్యనారాయణ తదితరులను సన్మానించడం విశ్వబ్రాహ్మణులు తమ ప్రతిభను తాము గౌరవించుకున్నట్టే అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా, "మీరు ఇంకా ఉన్నత శిఖరాలకు ఎదగాలి. మన విశ్వబ్రాహ్మణ జాతిలో చదువుకుంటున్న యువతకు మీరందరూ ఆదర్శంగా నిలవాలి. వారికి ఎల్లవేళలా మద్దతుగా ఉండాలి" అని శివప్రసాద్ ఆకాంక్షించారు.కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం ఉపాధ్యక్షులు ముతోజు శ్రీనివాస్, కార్యదర్శి కట్ట శ్రీకాంత్, జిల్లా కోశాధికారి కడార్ల శ్రీనివాస్, కార్యదర్శి కోటగిరి చిరంజీవి, బోనాల సత్యం, జిల్లా, పట్టణ, ముఖ్య నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని మరింత ఘనతపరిచారు.

# అట్టహాసంగా జిల్లా స్థాయి చదరంగ పోటీ.

**ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఎంపికైన క్రీడాకారులకు మెడల్స్ మరియు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎస్సై మధుకర్.**





**ఎలిగేడు, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)** : పెద్దపల్లి జిల్లా స్థాయి చదరంగ పోటీలు ఎలిగేడు మండల కేంద్రంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 69వ ఎస్ జి ఎఫ్ పెద్దపెల్లి జిల్లా స్థాయి 14,17 సంవత్సరాల బాలబాలికల చదరంగ పోటీలు ఎలిగేడు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ పోటీలను పెద్దపల్లి జిల్లా ఎస్ జి ఎఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్ ప్రారంభించారు.ఈ పోటీలకు జిల్లాలోని వివిధ పాఠశాలల నుండి 200 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్ జి ఎఫ్ కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ చదరంగం గొప్ప ఆలోచనా శక్తిని ఇస్తుందన్నారు.విద్యార్థుల్లో ఏకాగ్రత, పట్టుదల, జ్ఞాపకశక్తి పెరుగుతుందని చెప్పారు. మేధో సంపత్తికి చెందిన క్రీడ కావడంతో విద్యార్థినీ విద్యార్థులు ఈ క్రీడపై ఎక్కువ దృష్టి సారించాలని, క్రీడాకారులు గెలుపోటములు సమానంగా తీసుకోవాలని, ఓడిపోతే కసి పెంచుకొని మళ్లీ గెలవడానికి ప్రయత్నించాలే గానీ, కుంగిపోవద్దని సూచించారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు స్థానిక ఎస్సై మధుకర్ బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గడ్డాల శ్రీనివాస్, భాను, ఎలిగేడు మండల చెస్ అసోసియేషన్ అధ్యక్షులు తాటిపల్లి సతీష్ బాబు, ఆర్గనైజర్ అడ్డగుంట శ్రీనివాస్ గౌడ్, భరోసా స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు అక్కినపల్లి నాగరాజు, పాఠశాల విద్య కమిటీ వ్యాయామ ఉపాధ్యాయులు ప్రణయ్, వెంకటేష్, జావిద్, భాగ్యలక్ష్మి, సరస్వతి,నజియా, వెంకటలక్ష్మి,సత్యం, సురేష్, అజయ్, నరేష్,శేఖర్, అంజన్ కుమార్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# పర్యావరణ విప్లవానికి అమెరికన్ మోడల్

❖ వాన్‌పూల్‌తో ఇండియా నగరాల్లో సుస్థిర అభివృద్ధి.
❖ జనసాంద్రత అధికంగా ఉన్న భారత్ దృష్టి సారించాలి!



**హైదరాబాద్,అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** భారతదేశ మెట్రో నగరాలు ఎదుర్కొంటున్న తీవ్రమైన ట్రాఫిక్ మరియు వాయు కాలుష్యం సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారంగా, అమెరికాలోని సియాటిల్ నగరంలో విజయవంతమైన 'వాన్‌పూల్' విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని పర్యావరణ పరిరక్షణ మరియు అభివృద్ధి మండలి (ఈపీడీసీ), యునైటెడ్ ఇండియా జాతీయ సలహాదారు డాక్టర్ లయన్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఒక్కో వాన్‌లో 5 నుంచి 12 మంది ఉద్యోగులు ప్రయాణించే ఈ కమ్యూనిటీ ట్రాన్సిట్ మోడల్, ఒక్కో వాన్ రోడ్డుపై నుంచి పది కార్లను తొలగిస్తుంది అనే సూత్రంపై ఆధారపడి ఉంది. దీని ద్వారా కర్బన ఉద్గారాలు భారీగా తగ్గుతాయి, ఇంధనం ఆదా అవుతుంది, మరియు రహదారులపై ఒత్తిడి తగ్గి సుస్థిర నగర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన ఉద్ఘాటించారు. ఈ పచ్చదన పయనంలో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి ), పన్ను రాయితీలు, మరియు ప్రత్యేక లేన్ల ఏర్పాటు అత్యంత కీలకం.మౌలిక వసతులు, ఆర్థిక అభివృద్ధికి వాన్‌పూల్ కీలకం. వాన్‌పూల్ వ్యవస్థ అమలు కేవలం కాలుష్యాన్ని తగ్గించడానికే పరిమితం కాదని, మౌలిక సదుపాయాలపై భారాన్ని తగ్గిస్తుందని మరియు ఆర్థిక సామర్థ్యాన్ని పెంచుతుందని డా. గోపాల్ రెడ్డి వివరించారు. ఈ విధానంలో ప్రభుత్వం శిక్షణ పొందిన డ్రైవర్లు, మెయింటెనెన్స్ మరియు భద్రతా ప్రమాణాల పర్యవేక్షణ బాధ్యతలు తీసుకుంటుంది. తద్వారా ఖరీదైన రోడ్ల విస్తరణ అవసరం తగ్గుతుంది, మరియు ట్రాఫిక్‌లో వృథా అయ్యే ఉత్పత్తి సమయం ఆదా అవుతుంది. పన్ను రాయితీలు, ఇంధన సబ్సిడీలు వంటి ప్రోత్సాహకాలు ప్రజలను ఈ విధానంలో భాగస్వాములను చేస్తాయి. హైదరాబాద్, బెంగళూరు, పుణే వంటి టెక్ హబ్‌లలో మొదట ప్రాయోగిక ప్రాజెక్టులు ప్రారంభించి, క్రమంగా దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఆయన సూచించారు.టెక్నాలజీ, కార్పొరేట్ భాగస్వామ్యంతో ప్రజా చైతన్యం ఈ ప్రతిపాదన విజయానికి టెక్నాలజీ వినియోగం, కార్పొరేట్ భాగస్వామ్యం తప్పనిసరి. డా.గోపాల్ రెడ్డి సూచనల ప్రకారం, ప్రయాణికుల మార్గాలు మరియు సమయాలను సమన్వయం చేసేందుకు ప్రత్యేక డిజిటల్ మ్యాచింగ్ యాప్‌లు అభివృద్ధి చేయాలి. పెద్ద కంపెనీలు తమ ఉద్యోగుల ప్రయాణాలకు ఆర్థిక సహకారం అందించేలా ప్రోత్సహించాలి. అంతిమంగా, పర్యావరణ పరిరక్షణలో విజయం సాధించాలంటే ప్రజా చైతన్యం పెరగాలని ఆయన పిలుపునిచ్చారు. "ఒక్కొక్కరికి ఒక వాహనం" అనే సంస్కృతిని తగ్గించి, "పంచుకునే ప్రయాణం – పచ్చదనం" అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఈ సమష్టి కృషితో, భారతదేశం కాలుష్య రహిత భవిష్యత్తు వైపు బలంగా అడుగు వేయగలదని, సుస్థిర నగరాభివృద్ధి లక్ష్యాన్ని చేరుకోగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# గంజాయి రవాణా చేస్తూ ముగ్గురు యువకులు అరెస్ట్




**మందమర్రి, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మందమర్రి మండలంలోని ముగ్గురు యువకులు కాగజ్ నగర్ నుండి గంజాయిని తీసుకువస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్సై రాజశేఖర్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. హోండా స్కూటీ (టీజీ 19A3932) పై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకుల వద్ద 100 గ్రాముల ఎండిన గంజాయిని స్వాధీనం చేసుకొని వారిని అరెస్ట్ చేశారు.

అరెస్ట్ అయినవారు: వేల్పుల వర్షిత్ (పోన్నారం), వేల్పుల రాహుల్ (ఆదిల్‌పేట్), ఐత మణిదీప్ (నస్పూర్) ు ముగ్గురూ 21 సంవత్సరాలవారు. వీరు గంజాయిని కొనుగోలు చేసి, విక్రయించేందుకు మరియు వ్యక్తిగత వినియోగానికి తీసుకువస్తున్నట్లు విచారణలో ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం వంటి నేరాలు ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం తీవ్ర నేరాలుగా పరిగణించబడతాయని, అవసరమైతే హిస్టరీ షీట్లు తెరుస్తామని పోలీసులు హెచ్చరించారు. యువత తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, స్నేహాలు, ఆర్థిక లావాదేవీలను గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గంజాయి వాడకం గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న ఎస్సై రాజశేఖర్, హెడ్ కానిస్టేబుల్ రాము, రాజేశ్వర రావు, సయ్యద్ మహమ్మద్‌లను బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ అభినందించారు.

# ఎన్నికల వాయిదాలతో విసుగెత్తిన ప్రజలు



**కరీంనగర్, అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ గందరగోళంగా సాగుతుండటంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బిఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు జక్కనపల్లి గణేష్ ఆవేదన వ్యక్తం చేశారు. పరిపాలన కాలం ముగిసినా, ఎన్నికలు వాయిదా పడుతూ రావడం వల్ల గ్రామీణ అభివృద్ధి పడిందన్నారు. లోకల్ బాడీలు లేకపోవడం వల్ల కేంద్ర నిధులు నిలిచిపోయాయని, జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లు సరైనవైనా, చట్టబద్ధ ప్రక్రియ లేకపోవడం వల్ల ఎన్నికలు నిలిచిపోయాయని తెలిపారు. ఖర్చుల కోసం ఆశావహులు సిరాస్తులు అమ్ముకోవడం, అప్పులు తీసుకోవడం వంటి పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. నామినేషన్ వేసిన అభ్యర్థులకు ఇది అవమానమని, ప్రభుత్వం న్యాయకోవిదులతో చర్చించి చట్టబద్ధంగా రిజర్వేషన్లు అమలు చేసి, ఎన్నికల ప్రక్రియను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

# రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలు

-వనపర్తిలో అంగరంగ వైభవంగా రూట్ మార్చ్
-ప్రజలు పూలతో స్వాగతం పలికిన స్వయంసేవకుల కవాతు



**వనపర్తి, అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈరోజు వనపర్తి నగరంలో పథసంచలన్ (రూట్ మార్చ్) ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణం నుంచి ప్రారంభమైన రూట్ మార్చ్ రెండు బృందాలుగా విభజించబడింది. ఒక బృందం గాంధీచౌక్ దారిగా, మరొక బృందం పీర్లగుట్ట మార్గంగా నగరంలోని ప్రధాన వీధుల గుండా క్రమశిక్షణతో ముందుకు సాగింది. ప్రతి బృందం సుమారు మూడున్నర కిలోమీటర్ల మేర పథసంచలన్ నిర్వహించగా, క్రమపద్ధతిలో స్వయంసేవకులు కవాతు చేశారు. నగర ప్రజలు రహదారుల వెంట నిలబడి పూలతో స్వాగతం పలికారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న శతాబ్ది ఉత్సవాల సందర్భంలో, ప్రతి ప్రాంతంలో "పంచ పరివర్తన" సూత్రాలను ఆచరించాల్సిందిగా సంఘ్ పిలుపునిచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ల భాస్కర్, కురుమూర్తి, తిరుపాజీ, అమరేందర్ తదితరులు పాల్గొన్నరు.

# బాలికలే దేశపు వెలుగులు

-రాజారాం ప్రకాష్
-బాలికల హక్కుల రక్షణ అందరి బాధ్యత అని పిలుపు



**వనపర్తి, అక్టోబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బాలికలే భారతదేశపు వెలుగులని, వారి హక్కులను నిర్లక్ష్యం చేస్తే దేశం అంధకారంలోకి నెట్టబడే ప్రమాదం ఉందని ప్రజావాగ్యకరుడు రాజారాం ప్రకాష్ అన్నారు. బాలికల దినోత్సవం సందర్భంగా స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'బాలికల విద్య, భద్రత, ఆత్మవిశ్వాసం పెంపొందించడం మనందరి సమిష్టి బాధ్యత. వారి హక్కులను కాపాడితేనే సమాజం పురోగమిస్తుంది" అని అన్నారు. ప్రత్యేక దినం సందర్భంగా బాలికలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి కుటుంబం బాలికలను సమాన హక్కులతో గౌరవించాలని ఆయన పిలుపునిచ్చారు.

# రామగుండం ఎయిర్‌పోర్ట్ కలకు చారిత్రాత్మక ముందడుగు



**రామగుండం, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)** పెద్దపల్లి జిల్లా ప్రజలకు శుభవార్త. రామగుండం ఎయిర్‌పోర్ట్ స్థాపన దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు ప్రీ-ఫిజిబిలిటీ స్టడీ కోసం రూ. 40.53 లక్షలు మంజూరు చేసి, ఫీజు చెల్లించినట్టు పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీ కృష్ణ తెలిపారు.591 ఎకరాల భూమిపై అనంతరగాంవ్ మండలంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదనపై స్టడీ జరగనుంది. గత రెండు సంవత్సరాలుగా కోరుకుంటున్న ఈ కల ఇప్పుడు సాకారం అవుతుందని, ఇది పెద్దపల్లి ప్రజలకు, సింగరేణి సిబ్బందికి, విద్యార్థులకు, వ్యాపార వర్గాలకు ఎంతో ప్రయోజనం కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు.హైదరాబాద్‌కి ప్రత్యక్ష కనెక్టివిటీ ఏర్పడడంతో ప్రయాణ సమయం తగ్గుతుందని, ప్రాంతానికి కొత్త ఆర్థిక, పారిశ్రామిక అవకాశాలు వస్తాయని వంశీ కృష్ణ అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానని, ఎయిర్‌పోర్ట్ స్థాపన వరకు తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## రోడ్డుపై గుంతను పూడ్చిన గ్రామస్థుల సేవా స్ఫూర్తి



**సైదాపూర్, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)** హుస్నాబాద్ నియోజికవర్గంలోని సైదాపూర్ మండలం ఏక్లాస్పూర్ గ్రామంలో రోడ్డుపై ఏర్పడిన పెద్ద గుంత స్థానిక ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది. ప్రయాణికులు, వాహనదారులు ప్రతిరోజూ ఇబ్బందులు పడుతున్న దృశ్యాన్ని చూసి గ్రామస్థులు చలించిపోయారు. సమస్య పరిష్కారానికి అధికారులెవరూ స్పందించకపోవడంతో, గ్రామస్థులే ముందుకు వచ్చి తమ సొంత ఖర్చులతో గుంతను పూడ్చి మరమ్మత్తులు చేపట్టారు.సామూహిక సేవా భావంతో ముందుకొచ్చిన శ్రీనివాస్ రెడ్డి, సంతపూరి హనుమంత్ రెడ్డి, ఆసరి రజనీకాంత్, ముక్కరి శివ కుమార్, కునమల్ల సతీష్ లు ఈ పనిని స్వయంగా నిర్వహించారు. వారి ఈ గొప్ప సేవా కార్యక్రమాన్ని గ్రామస్థులు హర్షంగా స్వీకరించి, వారిని అభినందించారు. ప్రజల అవసరాన్ని గుర్తించి, ప్రభుత్వ సహాయం లేకుండానే సమస్యను పరిష్కరించిన ఈ గ్రామస్థుల సేవా స్ఫూర్తి ప్రశంసనీయం.

# కరీంనగర్ ట్రాఫిక్ పోలీసుల వలలో 277 చలాన్ల మోటార్ సైకిల్

❖ రూ.79,845 జరిమానా బకాయి





**కరీంనగర్, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ నగరంలో ట్రాఫిక్ పోలీసులు చారిత్రాత్మక చర్యగా, ఐదు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న 277 ట్రాఫిక్ చలాన్లు పేరుకుపోయిన ఒక మోటార్ సైకిల్‌ను తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నారు. ఈ వాహనంపై మొత్తం రూ.79,845 జరిమానా బకాయి ఉన్నట్లు గుర్తించి, వెంటనే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటన కరీంనగర్ పట్టణంలోని సిక్కువాడి ప్రాంతంలో ఉదయం 11 గంటల సమయంలో చోటుచేసుకుంది. ట్రాఫిక్–II విభాగానికి చెందిన ఇన్‌స్పెక్టర్ పి. రమేష్, కానిస్టేబుల్ జి. శ్రీనివాస్ రావు నేతృత్వంలోని బృందం సాధారణ ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో {TS 02 EX 1395} నంబర్ ఉన్న హీరో యునికార్న్ మోటార్ సైకిల్‌ను ఆపి, వాహన వివరాలు పరిశీలించగా, భారీ సంఖ్యలో ట్రాఫిక్ ఉల్లంఘనలు నమోదైనట్లు వెల్లడైంది. వాహనాన్ని నడుపుతున్న వ్యక్తిని గోదాం గడ్డకు చెందిన అబ్దుల్ ఖయ్యూమ్ (వయసు 37), ఆర్‌ఎంపీ ప్రాక్టీషనర్‌గా గుర్తించారు. 2019 జూన్ 8 నుండి 2024 డిసెంబర్ 25 వరకు కరీంనగర్ మరియు పరిసర ప్రాంతాల్లో నమోదైన చలాన్లలో 264 కేసులు కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోనే ఉన్నాయి. ప్రధాన ఉల్లంఘనలలో హెల్మెట్ లేకుండా ప్రయాణించడం (254), ముఖానికి మాస్క్ ధరించకపోవడం (10), ముగ్గురు వ్యక్తులు ఒకే వాహనంపై ప్రయాణించడం (7), సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం (2), డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ప్రయాణించడం (2), సక్రమంగా లేని నంబర్ ప్లేట్ (1), జిగ్‌జాగ్ డ్రైవింగ్ (1) ఉన్నాయి. ఈ సందర్భంగా అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్) శ్రీ యాదగిరిస్వామి మాట్లాడుతూ, "ఇంత పెద్ద మొత్తంలో చెల్లించని జరిమానాలు ట్రాఫిక్ చట్టాల పట్ల నిర్లక్ష్యాన్ని సూచిస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులు వీటిని తీవ్రంగా పరిగణిస్తారు. బకాయి వసూలు కోసం చట్టపరమైన చర్యలు వెంటనే ప్రారంభిస్తాం" అని తెలిపారు. వాహన స్వాధీనం, జరిమానా వసూలు వంటి తీవ్రమైన పరిణామాలను నివారించాలంటే, వాహన యజమానులు తమ పెండింగ్ చలాన్లను వెంటనే తనిఖీ చేసి క్లియర్ చేసుకోవాలని ఆయన గట్టిగా సూచించారు.

# పెద్దపల్లిలో అభివృద్ధి పనుల పరిశీలన



**పెద్దపల్లి, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పెద్దపల్లి పట్టణంలోని చీకురాయి చౌరస్తా నుండి మొదటి గేటు వరకు జరుగుతున్న డబుల్ రోడ్డు పనులను శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు శుక్రవారం పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, స్థానిక నాయకులు, అధికారులు ఆయనతో ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 3.5 కోట్లతో రహదారి, 40 లక్షలతో డ్రైనేజ్ నిర్మాణం జరుగుతోందని, మొత్తం 4 కోట్లతో పట్టణ ముఖద్వారం అభివృద్ధి చెందుతోందన్నారు. ఓదెల, భోజన్నపేట, మూలసాల ప్రాంతాల ప్రజలకు ప్రయాణం సులభమవుతుందని చెప్పారు. ఇప్పటివరకు 40 కోట్ల పనులు పూర్తయ్యాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 15 కోట్ల నిధులు మంజూరు చేశారని, అదనంగా 50 కోట్ల నిధుల కోసం విజ్ఞప్తి చేశామని తెలిపారు. అమృత్ 2.0 కింద పెద్ద మసీద్ వద్ద 10 లక్షల లీటర్ల, చందపల్లిలో 5 లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకులు నిర్మిస్తున్నామని, తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పెద్దమ్మ నగర్ నుండి షమీం కిరాణం వరకు, తెలుగువాడ స్మశానవాటిక నుండి చందపల్లి కెనాల్ వరకు డివైడర్ పనులు పూర్తయ్యాయని, త్వరలోనే సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. పట్టణ అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని, ఆయనకు ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప్, మున్సిపల్ ఏఈ సతీష్, టౌన్ ప్లానింగ్ అధికారులు, మాజీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# గిన్నిస్ విజేతలకు గులాం అహ్మద్ అభినందన



**కరీంనగర్, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
చెన్నై మద్రాస్ సేవట్ కళాశాల స్టేడియంలో నిర్వహించిన బుద్ధి ధర్మా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అటెంప్ట్‌లో పాల్గొని కరీంనగర్‌కు గౌరవం తీసుకొచ్చిన అన్వర్ ఖాన్, అర్మాన్ ఖాన్, ఫర్హాన్ ఖాన్‌లను ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ శుక్రవారం దారుస్సలామ్ కార్యాలయంలో అభినందించారు. గిన్నిస్ మెడల్, టీషర్ట్, సర్టిఫికేట్‌లను వారు ప్రదర్శించారు. ఇంటర్నేషనల్ గోజీరాయ్ కరాటే అకాడమీ మాస్టర్ అన్వర్ ఖాన్ ఆధ్వర్యంలో ప్రపంచ రికార్డు సాధించడం కరీంనగర్‌కు గర్వకారణమని గులాం అహ్మద్ పేర్కొన్నారు. లండన్, అమెరికా నుండి వచ్చిన గిన్నిస్ నిర్వాహకులు రిషినాథ్, వినోద్ సరూగి, సర్వోనన్ చేతుల మీదుగా బుద్ధి ధర్మా గిన్నిస్ మెడల్, టీషర్ట్, సర్టిఫికేట్‌లు అందుకున్నట్లు తెలిపారు.

# గిన్నిస్ విజేతలకు ఎమ్మెల్యే నాయిని అభినందన



**వరంగల్, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తమిళనాడులో జరిగిన కరాటే మహోత్సవంలో గిన్నిస్ వరల్డ్ రికార్డులో బంగారు పతకం సాధించిన వరంగల్ పశ్చిమ యువకులు మహ్మద్ ఆసియా, మహ్మద్ ఇర్ఫాన్‌లను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అభినందించారు. హనుమకొండ మైనార్టీ గురుకులంలో ఇంటర్ చదువుతున్న ఆసియా, కొత్తవాడ గోల్డెన్ కిడ్స్ హై స్కూల్‌లో చదువుతున్న ఇర్ఫాన్ తమ ప్రతిభతో ప్రపంచస్థాయి గౌరవం సంపాదించారు. వారు గెలుచుకున్న గిన్నిస్ పతకాన్ని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సన్మానించి, జిల్లా, రాష్ట్రానికి పేరు తెచ్చినందుకు హర్షం వ్యక్తం చేశారు. వారి భవిష్యత్తు మరింత ప్రతిభావంతంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ పోటీ చెన్నై తాంబరం ఎస్ఐబీఈటీ కాలేజీలో వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మాస్టర్ బాలమురుగన్ ఆధ్వర్యంలో, లండన్ నుండి వచ్చిన గిన్నిస్ అధికారి మిస్టర్ రిషి నాద్ సమక్షంలో జరిగింది.

# డా. వెంకట్ నోముల కు గౌరవ సత్కారం




**హైదరాబాద్, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం –2025 సందర్భంగా హైదరాబాద్‌లోని హెలెన్ కెల్లర్ కాలేజ్‌లో మానసిక ఆరోగ్య అవగాహన ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ సైకాలజిస్టుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దివ్యాంగులు సహా 1000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 'మానసిక ఆరోగ్యం లేకుండా శారీరక ఆరోగ్యం అసంపూర్ణం" అనే నినాదంతో మానసిక శ్రేయస్సు ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా మానసిక ఆరోగ్య రంగంలో విశిష్ట సేవలందిస్తున్న డా. వెంకట్ నోముల (అసోసియేట్ ప్రొఫెసర్, సీనియర్ సైకాలజిస్టు, తెలంగాణ సైకాలజిస్టుల సంఘం వైస్ ప్రెసిడెంట్) ను ఎమ్మెల్యే మార్రి రాజశేఖర్ రెడ్డి సత్కరించి మెమెంటో అందజేశారు. ఉపన్యాసాలు, కౌన్సెలింగ్, టీవీ –రేడియో ప్రసారాలు, సర్వేలు, పుస్తక రచనలు, ఉచిత పుస్తక పంపిణీ వంటి సేవల ద్వారా ఆయన చేస్తున్న కృషికి ఈ గౌరవం లభించింది. సంఘం అధ్యక్షుడు డా. మోతుకూరి మాట్లాడుతూ "విద్యా రంగం, ప్రజా సంఘటనల ద్వారా మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న డా. వెంకట్ నోముల సేవలు ప్రేరణాత్మకంగా ఉన్నాయి" అని ప్రశంసించారు. ఈ కార్యక్రమం హెలెన్ కెల్లర్ కాలేజ్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హైటెక్ సిటీ సహకారంతో నిర్వహించారు.

# ఘనంగా బాలికల దినోత్సవం



**కరీంనగర్, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని కపిల్ కుటీర్ శిశు సంరక్షణ కేంద్రంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివిధ శిశు సంరక్షణ కేంద్రాల్లోని బాలికలకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి మార్త సరస్వతి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ శ్రీరామోజు ధనలక్ష్మి, డిసిపిఓ పర్వీన్, ఉపాధ్యక్షుడు వకులా రాజారెడ్డి ఆధ్వర్యంలో బాలిక విద్యా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పూదరి శాంత, ఆవుల సంపత్ యాదవ్, సాదినేని రమేష్, నాయిని స్వప్న, సాయి కిరణ్ గౌడ్, కడే మహేష్, ప్రియాంక, శ్రీనివాస్, కృష్ణవేణి, సంతోషిని, కీర్తి, సరస్వతి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవా అవార్డు పొందిన మనీ సాయి వర్మ



**వేములవాడ, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వేములవాడ మండలం నమిలి గుండుపల్లి గ్రామానికి చెందిన వంగపల్లి మల్లేశం –భాగ్య దంపతుల కుమారుడు వంగపల్లి మనీ సాయి వర్మకు భారత రాష్ట్రపతి చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డు లభించింది. 2019 –2023 మధ్య సీఎంఆర్ఐ కాలేజీలో బీటెక్ చదువుతున్న సమయంలో స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ద్వారా సమాజ సేవలో చురుకుగా పాల్గొన్నందుకే ఈ గౌరవం లభించిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కుమ్మరి నాయకులు, గ్రామస్తులు మనీ సాయి వర్మను అభినందిస్తూ, ఆయన సేవా తత్పరతకు ప్రశంసలు కురిపించారు.

# జర్నలిస్టుపై హత్యాయత్నం

## - మంద పవన్‌పై చర్యలు డిమాండ్



**సిద్ధిపేట, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సిద్ధిపేటలో జర్నలిస్టు దేవులపల్లి భూపతిపై జరిగిన హత్యాయత్నం కేసులో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత జెఏసి రాష్ట్ర నేత బత్తుల చంద్రమౌళి డిమాండ్ చేశారు. అసలైన నిందితుడిపై ఇప్పటివరకు పోలీసులు చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పోలీస్ కమిషనర్ స్పందించి, మంద పవన్‌తో పాటు అతని అనుచరులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి రిమాండ్ చేయాలని కోరారు. జర్నలిస్టులపై దాడులు ప్రజాస్వామ్యంపై దాడులేనని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెఏసి రాష్ట్ర నాయకులు గోరటి వెంకటేశం, మాచర్ల రాజయ్య, కరుమూరు శంకర్, గాజుల రమేష్, ముత్యాల రమణయ్య, దాసరి అనిల్ కుమార్, పల్లె ఆయరాజు, కల్లందుల కిరణ్, చింతల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మహా పాదయాత్రగా బయలుదేరిన అయ్యప్ప భక్తుడు



**ఎలిగేడు, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
: మండల కేంద్రానికి చెందిన బుర్ర అజయ్ గౌడ్ అయ్యప్ప స్వామి దర్శనానికై మహా పాదయాత్రగా బయలుదేరినాడు. ఎలిగేడు లోని శ్రీ సీతారామ స్వామి ఆలయంలో ఇరుముడి కట్టిన గురుస్వామి మిట్టపల్లి మురళి అజయ్ కి ఆశీర్వచనాలు అందించాడు. మహా పాదయాత్ర అనే సంకల్పం చాలా గొప్పదని గురుస్వామి అన్నారు. అయ్యప్ప మాల ధరించి నిష్ఠగా ఉంటూ ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొందేందుకు మాల ధారణ ఎంతో తోడ్పాటు గా ఉంటుందన్నారు. ఈ మహా పాదయాత్ర 45 రోజులపాటు చేయనున్నట్లు మాల దీక్ష పరులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మామిడాల రమేష్ బుర్ర గణేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లెల్లగడ్డ పాఠశానను తనిఖీ చేసిన గ్రంథాలయ చైర్మన్



**హుస్నాబాద్, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హుస్నాబాద్ మండలంలోని జిల్లెల్లగడ్డ సోషల్ వెల్ఫేర్ పాఠశానను జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి అకస్మాత్తుగా సందర్శించారు. ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విద్యార్థి వివేక్ ఘటనపై ఆయన ప్రత్యేకంగా స్పందించారు. ఈనెల 7న జరిగిన ఘటన స్థలాన్ని పరిశీలించిన లింగమూర్తి, పాఠశాల ప్రిన్సిపాల్‌ను పలు అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి మృతిపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసినట్లు లింగమూర్తి తెలిపారు. ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపేందుకు మంత్రి ఆదేశించినట్టు పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, విద్యార్థుల భద్రతకు సంబంధించి తగిన చర్యలు చేపడతామని లింగమూర్తి హామీ ఇచ్చారు.

## రైతుల పక్షపాతి ప్రధాని మోదీ: బండి సంజయ్



**తిమ్మాపూర్, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ తిమ్మాపూర్ మండలంలోని మిల్క్ డెయిరీ వద్ద రూ.90.70 కోట్లతో నిర్మించిన ఆటోమెటిక్ పెరుగు కేంద్రాన్ని శుక్రవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ రైతుల పక్షపాతి అని కొనియాడారు. ధన్ ధాన్య కృషి యోజన ద్వారా దేశవ్యాప్తంగా 1.7 కోట్ల మంది రైతులకు లాభాలు చేకూరనున్నాయని, తెలంగాణలో నాలుగు జిల్లాల్లో ఈ పథకం అమలవుతోందన్నారు. అంతర్జాతీయంగా యూరియా ధరలు పెరిగినా, కేంద్రం భారం భరిస్తూ సబ్సిడీ ధరకే అందిస్తోందని తెలిపారు. కరీంనగర్ డెయిరీ 27 ఏళ్ల చరిత్రలో లక్షమంది పాడి రైతులకు ఆదరణగా నిలుస్తోందని, కేంద్రం ఎప్పటికీ అండగా ఉంటుందని చెప్పారు. డెయిరీ ప్రొడక్ట్స్‌ను ఆపేందుకు కొందరు యత్నిస్తున్నారని, వాటిని నిలిపివేయకుండా మరింత విస్తరించాలన్నారు.

## బిజేపితోనే అభివృద్ధి: ఎనుగుల అనిల్



**శంకరపట్నం, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
శంకరపట్నం మండలంలోని కన్నాపూర్ గ్రామంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన బోరుబావిని శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు ఎనుగుల అనిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు.గ్రామస్తుల విజ్ఞప్తికి వెంటనే స్పందించిన కేంద్రమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, ముదిరాజ్ సంఘం నాయకులు, బీజేపీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# హక్కుల సాధన కోసం ఎంతవరకైనా వెళ్దాం...





- సోషల్ వెల్ఫేర్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ...
- సంఘటితంగా ఉంటేనే సమస్యల పరిష్కారం...
- సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి ....

**కరీంనగర్, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సంఘటితంగా ఉండి హక్కుల కోసం పోరాడితేనే హక్కులను సాధించుకుంటామని కరీంనగర్ జిల్లా టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అసోసియేషన్లు అన్ని ఏకతాటి మీదికి వచ్చి సంఘటితంగా ఉండాలని ఆయన సూచించారు. సోషల్ వెల్ఫేర్ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పు సత్యనారాయణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా శ్రీనివాస్ రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అసోసియేషన్లు ఏకతాటి మీదికి రావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు మాట్లాడుతూ మినిస్టీరియల్ ఉద్యోగస్తులు సంఘటితంగా అసోసియేషన్ ను ఏర్పాటు చేసుకొని సంఘటితంగా ముందుకు రావడానికి రావడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. టీఎన్జీవో అసోసియేషన్ ఈ రోజున ఇంత పకడ్బందీగా పనిచేస్తున్నదంటే ఎందరో త్యాగదనుల కృషి ఫలితమే అన్నారు. సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి తాము ఎల్లవేళలా అండదండగా ఉంటామని హామీ ఇచ్చారు. మినిస్ట్రీయల్ సిబ్బంది హక్కుల సాధన విషయంలో తాము రాజీ పడే ప్రసక్తే లేదని, హక్కుల సాధన కోసం ఎంతవరకైనా వెళ్దామని రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా టీఎన్జీవో ఆమోదించిన ధ్రువీకరణ నియామక పత్రాలను సోషల్ వెల్ఫేర్ నూతన కార్యవర్గ సభ్యులకు టీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు గూడ ప్రభాకర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి అరవింద్ సింగ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, లక్ష్మణరావు చేతుల మీదుగా ప్రొసీడింగ్స్ ను నూతన కార్యవర్గానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూపి అరవింద్ కుమార్ వార్షిక నివేదికను సమర్పించగా, కోశాధికారి కే.జీవన్ వ్యయ పట్టికను సమర్పించారు. అంతకుముందు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.సంపత్ కుమార్ నూతన కార్యవర్గానికి స్వాగతం పలికారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగి బి.రమేష్, మరియు రాష్ట్ర కార్యవర్గానికి టీఎన్జీవో నేతలు ఘన సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డం ప్రభాకర్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ, కార్యదర్శి యూపి అరవింద్ కుమార్, కోశాధికారి కే.జీవన్, ఉమెన్స్ వింగ్ స్టేట్ అసోసియేట్ కే.లత, అసోసియేషన్ నేతలు అసోసియేట్ అధ్యక్షులు హెచ్ రాజీవ్ రాజు, పబ్లిసిటీ సెక్రెటరీ డప్పు గోపాల్, రాష్ట్ర సలహాదారులు ఎండి.రహీముద్దీన్, కొప్పుల హనుమంతరావు, శ్రీనివాస్ వేక్కిరాల, మన్నే సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాళ్ల బండి వెంకట రామ్ ప్రసాద్, అస్లాం, హైమావతి, రవీందర్, శ్రావణ్, చైతన్య, ప్రీతం, లింగమూర్తి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బోనాల రవి, కార్యదర్శి బి.కృపానందం, ఉపాధ్యక్షులు ఎస్.సత్యనారాయణ, పబ్లిసిటీ సెక్రటరీ ఎన్.పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మధుకర్ ఆత్మహత్యపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం

### 48 గంటల డెడ్‌లైన్

**వేమనపల్లి, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలంలో బీజేపీ అధ్యక్షుడు యాట మధుకర్ ఆత్మహత్య ఘటనపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మధుకర్ కుటుంబాన్ని పరామర్శించిన ఆయన, వారి దుస్థితిని స్వయంగా పరిశీలించి, బాధ్యత వహించాల్సిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డెడ్‌లైన్ విధించారు. "48 గంటలు టైమిస్తున్నా. మధుకర్ ఆత్మహత్యకు కారణమైన వారిని అరెస్ట్ చేసి జైలుకు పంపాలి. వేధించిన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలి. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవు. హైదరాబాద్, రామగుండం కమిషనరేట్‌లను బీజేపీ కార్యకర్తలతో ముట్టడిస్తాం. బాధ్యులకు తగిన గుణపాఠం చెబుతాం. అంతదాకా తెచ్చుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నా," అంటూ బండి సంజయ్ ఘాటుగా స్పందించారు. మధుకర్ కుటుంబ సభ్యులు, ఆయనపై కాంగ్రెస్ నేతలు, పోలీసులు కలసి దౌర్జన్యంగా వ్యవహరించారని, ఇంటిపై దాడి చేసి,





అత్యాచార యత్నం, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని వాపోయారు. మధుకర్ తీవ్ర పేదరికంలో జీవిస్తూ, తలుపులు లేని ఇంట్లో నివసిస్తున్నాడని చూపించారు. ఈ దృశ్యాన్ని చూసిన బండి సంజయ్ తీవ్రంగా చలించి, తక్షణ సాయంగా లక్ష రూపాయలు అందజేశారు. బీజేపీ పార్టీ పూర్తిగా మధుకర్ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. "మధుకర్ ఆత్మహత్య కాదు, ఇది కాంగ్రెస్ ప్రేరేపిత హత్య. బీఆర్ఎస్ అరాచకాలను ఓడించాక, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మరింత దౌర్జన్యంగా వ్యవహరిస్తోంది. పోలీసులు అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ, మధుకర్ లాంటి నిజాయితీ గల నాయకులను వేధిస్తున్నారు. ఏ ప్రభుత్వం శాశ్వతం కాదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఉన్నా, కేంద్రంలో బీజేపీ ఉంది. రాబోయేది బీజేపీ ప్రభుత్వమే. గూండాగిరి చేసే నాయకులను యూపీ తరహాలో శిక్షిస్తాం. వత్తాసు పలికే పోలీసులకు చుక్కలు చూపిస్తాం," అంటూ బండి సంజయ్ మండిపడ్డారు. బీజేపీ కార్యకర్తలకు ఆయన పిలుపు ఇచ్చారు – "ఆత్మహత్యలు పరిష్కారం కాదు. తెగించి పోరాడే వాడే నిజమైన బీజేపీ కార్యకర్త. నక్సలైట్ల తూటాలకు కూడా భయపడని చరిత్ర బీజేపీది. కాంగ్రెస్ ఎంత అరాచకాలు చేసినా, భయపడొద్దు. ప్రజల కోసం పోరాటం కొనసాగించాలి." ఈ ఘటనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రావాలనుకున్నప్పటికీ, అత్యవసరంగా ఢిల్లీ వెళ్లాల్సి వచ్చిన నేపథ్యంలో, ఆయన సూచన మేరకు బండి సంజయ్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. మధుకర్ కుటుంబానికి అండగా నిలుస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

# వైకుంఠ రథం కోసం ప్రజల అవస్థలు తీరేనా?





**కరీంనగర్, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ నగరపాలక సంస్థ ప్రవేశపెట్టిన "ఒక రూపాయి" అంత్యక్రియల పథకం మంచి ఉద్దేశంతో ప్రారంభమైనా, అమలులో మాత్రం అనేక అవరోధాలు ఎదురవుతున్నాయి. ప్రజల పన్నుల ద్వారా సమకూరే నిధులతో పేదవారికి మేలు చేయాలన్న సంకల్పం, అధికారుల నిర్లక్ష్యంతో విఫలమవుతోంది. డివిజన్ ఆఫీసర్‌కు ఈ పథకం బాధ్యతలు అప్పగించడంతో, ఆయనకు స్థానిక ప్రజలతో సంబంధాలు లేకపోవడం వల్ల సేవల అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డివిజన్లో ఎవరైనా మరణించినప్పుడు వారి కుటుంబ సభ్యులు ఆఫీసర్‌ను సంప్రదించినా, స్పందన లేకపోవడం, ఇతర అధికారులు "వాడా ఆఫీసర్ను సంప్రదించండి" అనే సలహాతో తప్పించుకోవడం వల్ల బాధితులు బల్దియా చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నారు. కుటుంబంలో విషాదం నెలకొన్న సమయంలో, అధికారుల నిర్లక్ష్యంతో మరింత బాధ ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో, డివిజన్‌లో నిత్యం పారిశుద్ధ్య పనులు నిర్వహించే జవాన్‌కు ఈ పథకం బాధ్యతలు అప్పగిస్తే, ఆయనకు స్థానికుల వివరాలు (ఆధార్, రేషన్ కార్డు, నివాసం) తెలుసు కావడంతో, సేవలు వేగంగా అందించగలడు. ఈ పథకం కార్పొరేటర్లు లేదా డివిజన్ అధికారులు నడిపించలేకపోతున్న పరిస్థితుల్లో, ఇది పూర్తిగా ప్రజల పన్నుల ద్వారా నడుస్తున్న ప్రభుత్వ పథకం కావున, మున్సిపల్ కమిషనర్ స్వయంగా జోక్యం చేసుకుని, ప్రజల అవస్థలు తీరేలా తగిన నిర్ణయం తీసుకోవాలని బీజేపీ నాయకుడు జంగాల పెల్లి కుమార్ విజ్ఞప్తి చేశారు.

## జీఎస్టీ అమలుకు సహకరించండి

- బాల సైదయ్య



**కరీంనగర్, అక్టోబర్11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ ఎల్ఐసి ఏజెంట్ల సంఘ భవనంలో శుక్రవారం నిర్వహించిన జీఎస్టీ అవగాహన సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ కే. బాల సైదయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జీఎస్టీ సంస్కరణలు పేద, మధ్యతరగతి ప్రజలకు వరంగా నిలుస్తాయని, వ్యాపార నిర్వహణ సులభతరమవుతుందని తెలిపారు. ఇటీవల జరిగిన 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఐదు స్లాబుల స్థానంలో మూడు స్లాబులు అమలులోకి వచ్చాయని, నిత్యవసరాలు 0, 5, 18% స్లాబుల్లోకి చేరాయని పేర్కొన్నారు. పన్ను తగ్గడంతో వినియోగం పెరిగి ఆర్థిక వృద్ధికి దోహదం అవుతుందని అన్నారు. జీఎస్టీ అమలుకు వ్యాపార వాణిజ్య సంఘాలు సహకరించాలని, పన్ను విరుద్ధంగా విక్రయాలు జరిగితే వినియోగదారులు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో పర్యవేక్షకులు పి.ఎస్.ఎన్. బాబ్జి, శిరీష్, గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

## వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే జీఎస్సార్



**భూపాలపల్లి, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన "ప్రధానమంత్రి ధన -ధాన్య కృషి యోజన" వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పప్పు ధాన్యాల సాగు రైతులకు లాభదాయకమని, దేశ ఆహార భద్రతకు దోహదం చేస్తుందని పేర్కొన్నారు. రైతుల ఆదాయం పెంచే దిశగా యోజనను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఆధునిక పద్ధతులు, మట్టి పరీక్షలు, నీటి సంరక్షణ విధానాలను రైతులు అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారులు, రైతు సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## చివరి దశలో ఈ-పంట నమోదు



**హుస్నాబాద్, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-పంట నమోదు ఈ నెల 25వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 50 శాతం లోపే నమోదు పూర్తయిందని అధికారులు తెలిపారు. రైతులు తప్పనిసరిగా తమ పంట వివరాలను సమీప రైతు సేవా కేంద్రాల్లో ఖచ్చితంగా నమోదు చేయాలని ప్రభుత్వం సూచించింది. తుది జాబితా ఈ నెల 31న ప్రదర్శించనున్నారు. అన్ని రకాల రైతులు తమ పంట నమోదును వెంటనే పూర్తి చేయాలని అధికారులు హెచ్చరించారు.

## జమ్మికుంటలో ధన -ధన్య యోజన ప్రత్యక్ష ప్రసారం



**జమ్మికుంట, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జమ్మికుంట ప్రకాష్ కృషి విజ్ఞాన కేంద్రం (కెవికె) లో శుక్రవారం "ప్రధానమంత్రి ధన -ధన్య కృషి యోజన" ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం నిర్వహించారు. పప్పుధాన్యాల స్వావలంబన మిషన్ ప్రారంభంతో పాటు వ్యవసాయ మౌలిక సదుపాయాలు, పశుసంవర్ధకం, మత్స్య సంపద, ఆహార ప్రాసెసింగ్ రంగాల్లో 1,100కి పైగా ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలపై ప్రసారం జరిగింది. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్త వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకులు ఆకుల రాజేందర్, కొలకాని రాజు, అనేకమంది రైతులు, యువ శాస్త్రజ్ఞులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ





## పాల్గొన్న చల్లా వంశీచంద్ రెడ్డి

**కద్వాల్, అక్టోబర్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: కేంద్ర ఎన్నికల సంఘం బిజెపి అనుబంధ విభాగంగా పనిచేస్తుందని సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితుడు, డిసిసి అధ్యక్షుల నియామక ప్రక్రియ ఏఐసిసి ఇంచార్జ్ చల్లా వంశీచంద్ రెడ్డి ఆరోపించారు. బిజెపి ఓటు చోరీ కి అడ్డుకట్ట వేసేందుకు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 5 కోట్ల మంది సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కద్వాల్ మండల కేంద్రంలో శనివారం సాయంత్రం ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్య నాయక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి వంశీచంద్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. టీపీసీసీ సభ్యుడు అయిల్ల శ్రీనివాస్ గౌడ్, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి ప్రధాన కార్యదర్శి బిక్య నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహాతో కలిసి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్టోబర్ 15 వరకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పూర్తిచేసి అనంతరం కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు వంశీచంద్రెడ్డి పేర్కొన్నారు. బిజెపి ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకొని ఓటు చోరీ ద్వారా అధి పత్య రాజకీయాలు సాగిస్తుందని అన్నారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా దేశంలో రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్న పోరాటంలో ప్రజలంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా డీసీసీ అధ్యక్షుల నియామకం పారదర్శకంగా చేపడుతున్నట్లు చెప్పారు. ఈనెల చివరి వరకు డిసిసి అధ్యక్షుల నియామక ప్రక్రియ పూర్తవుతుందని వెల్లడించారు. యువత, బడుగు బలహీన వర్గాలు,ఎస్సీ ఎస్టీ,మైనార్టీలు, మహిళలకు డిసిసి అధ్యక్షుల నియామకంలో సమచితస్థానం కల్పిస్తున్నట్లు వంశీచంద్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో డిసిసి అధ్యక్షుల నియామక ప్రక్రియ ప్రారంభమైందని ఇప్పటికే అబ్జర్వర్లు రాష్ట్రానికి చేరుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేగురు వెంకటేశ్, రాములు, అంజయ్య, గుజ్జల మహేష్ యాదయ్య గౌడ్, లక్ష్మయ్య,బిక్షపతి, యాదగిరి రెడ్డి,జాంగిర్ అలీ, జాంగిర్ బాబా, షాబుద్దీన్, సత్యం, మల్లేష్ గౌడ్, రాము నాయక్, ఆనంద నాయక్, బాల్రాజ్, చెన్నయ్య, శ్యామ శేఖర్, శంకర్, రామకృష్ణ, సిలారి, శ్రీశైలం,మల్లయ్య రాజేష్, జవహర్లాల్,తులసిరాం, నరసింహ, యాదయ్య చెన్నయ్య హరిపు ఫరీదో అనిల్ కుమార్ లకపతి, నాయక్ ఇమ్రాన్ బాబా, అస్గర్ అలీ, మల్లయ్య, బలరాం నాయక్, కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి సహకారం అవసరం: ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**రామగుండం, అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ శుక్రవారం ఎన్‌టీపీసీ మిలీనియం హాల్‌లో నిర్వహించిన వ్యాపారస్తుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 15 కోట్లతో ఎన్‌టీపీసీ పరిధిలో రోడ్లు, డ్రైనేజ్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అందరి సహకారంతో అభివృద్ధి వేగంగా కొనసాగుతుందని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సర్వీస్ రోడ్లు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయనున్నట్లు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, వ్యాపారవేత్తలు, కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు. అదే రోజు ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రామగుండం అభివృద్ధి అంశాలపై చర్చించి, ఇందిరమ్మ హౌసింగ్ బిల్లుల మంజూరుకు విజ్ఞప్తి చేశారు. ఎన్‌టీపీసీ సీఎస్ఆర్ నిధుల ద్వారా అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని కోరారు. అంతర్గం, పాలకుర్తి మండలాల్లో రోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని సూచించారు. రామగుండం అభివృద్ధి ప్రభుత్వం, అధికార యంత్రాంగం సమన్వయంతో కొనసాగుతుందని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తెలిపారు.

## లాహెూర్‌లో పాలస్తీనా అనుకూల నిరసనలు..


### పోలీసుల కాల్పుల్లో 11 మంది మృతి




**న్యూఢిల్లీ -అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
గాజాలో మరణాలు, ట్రంప్ శాంతి ప్రణాళికకు వ్యతిరేకంగా దాయాది పాకిస్థాన్‌లో నిరసనలు కొనసాగుతున్నాయి. ఇస్లామిక్ సంస్థ తెహ్రీక్-ఇ-లబైక్ పాకిస్థాన్ కార్యకర్తలు గురువారం నుంచి పాక్‌లోని పలు ప్రాంతాల్లో ఆందోళనలు కొనసాగిస్తున్నారు. వారు చేస్తున్న ఆందోళనలను హింసాత్మక ఘర్షణలకు దారితీశాయి.నిరసనకారులు రాజధాని లాహెూర్ లో పాలస్తీనా అనుకూల ర్యాలీ నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగానే రాజధాని వైపు కవాతు చేస్తుండగా భద్రతా దళాలు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశాయి. ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. నిరసనకారులపై పంజాబ్ పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 11 మంది టీఎల్‌పీ కార్యకర్తలు మరణించగా.. సుమారు 50 మందికిపైగా గాయపడ్డారు. వారిని ఆస్పత్రులకు తీసుకువెళ్తే వైద్యం చేయడానికి కూడా అక్కడి వైద్యులు నిరాకరించినట్లు స్థానిక అధికారులు తెలిపారు. 'ఈ అల్లర్లలో పంజాబ్ పోలీసులు 11 మంది కార్యకర్తలను హత్య చేశారు' అని తెహ్రీక్-ఇ-లబైక్ పాకిస్థాన్ చీఫ్ సాద్ రిజ్వి ఆరోపించారు.

# కొంపముంచిన పేరు మార్పు..

## తీవ్ర సంక్షోభంలో బీర్ల కంపెనీ..!




**న్యూఢిల్లీ అక్టోబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
యువతలో ఎంతో ఆదరణ పొందిన క్రాఫ్ట్ బీర్ బ్రాండ్ 'బీరా 91 ' ఇప్పుడు తీవ్ర సంక్షోభంలో ఉంది. కంపెనీ పేరులో చేసిన ఒక చిన్న మార్పు ఆ బ్రాండ్ పతనానికి కారణమైంది. పేరు మార్పుతో అమ్మకాలు పూర్తిగా నిలిచిపోయాయి. దాంతో నష్టాలు భారీగా పెరిగాయి. ఫలితంగా ఉద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటోంది. చివరికి ఒక విజయవంతమైన స్టార్టప్ మూతపడే దశకు చేరుకుంది.వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల బీరా 91 మాతృ సంస్థ 'బి9 బేవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్' తన చట్టపరమైన పేరును 'బి9 బేవరేజెస్ లిమిటెడ్'గా మార్చింది. పేరు చివర ఉన్న 'ప్రైవేట్' అనే పదాన్ని తొలగించడం అతిపెద్ద సమస్యకు దారితీసింది. ఈ మార్పును కొత్త కంపెనీగా పరిగణించిన వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, బీరా 91 బీర్ అమ్మకాలను నిలిపివేశాయి. కొత్త పేరుతో మళ్లీ అన్ని రకాల అనుమతులు, లైసెన్సులు, ప్రోడక్ట్ రిజిస్ట్రేషన్లు పొందాలని ఆదేశించాయి. ఈ అధికారిక జాప్యం కంపెనీని కోలుకోలేని దెబ్బతీసింది. కాగా ఈ పరిణామంపై ఇన్వెస్టర్ డీ ముత్తుకృష్ణన్ స్పందిస్తూ.. ఒక చిన్న లోపం మొత్తం కంపెనీని ఎలా కూల్చివేస్తుందో చెప్పడానికి బీరా 91 ఒక ఉదాహరణ అన్నారు. సమస్యల కారణంగా అన్ని రాష్ట్రాలు అమ్మకాలను నిషేధించాయని చెప్పారు. దాంతో అసలు సమస్య మొదలైందని తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. పేరు మార్పువల్ల నెలల తరబడి అమ్మకాలు నిలిచిపోయి కంపెనీ ఆర్థికంగా కుప్పకూలింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో అమ్మకాలు 22% పడిపోగా, నష్టాలు 68% పెరిగి రూ.748 కోట్లకు చేరాయి. కంపెనీ మొత్తం ఆదాయం రూ.638 కోట్లు కాగా.. నష్టాలు అంతకుమించి ఉండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. అమ్మకాలు లేకపోవడంతో సుమారు రూ.80 కోట్ల విలువైన స్టాక్‌ను కంపెనీ రద్దు చేసుకోవాల్సి వచ్చింది. జూలై నుంచి ఉత్పత్తి కూడా నిలిచిపోయింది. ఈ క్రమంలో రూ.500 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చిన 'బ్లాక్‌రాక్' లాంటి సంస్థ కూడా వెనక్కి తగ్గినట్లు సమాచారం. ఈ సంక్షోభం ఉద్యోగులపైనా తీవ్ర ప్రభావం చూపింది. దాదాపు 250 మందికిపైగా ఉద్యోగులు కంపెనీ వ్యవస్థాపకుడు అంకుర్ జైన్‌ను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. మూడు నుంచి ఐదు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, సరఫరాదారులకు బిల్లులు కూడా చెల్లించలేదని ఆరోపించారు. ఈ ఆరోపణలపై స్పందించిన అంకుర్ జైన్, ఉద్యోగులకు జీతాలు చెల్లించడంలో జాప్యం జరిగిన మాట వాస్తవమేనని అంగీకరించారు. పేరు మార్పు, మద్యం పాలసీలలో మార్పులు, నిధుల సమీకరణలో జాప్యం వంటి కారణాలవల్ల గత 18 నెలలుగా కంపెనీ తీవ్రమైన